ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

## పాత్రికేయులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న ప్రజా రిపబ్లిక్ తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.

ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 02 సంచిక -312 | పేజీలు - 8 వెల - 03/- | శుక్రవారం 27 ఫిబ్రవరి 2026

# తెలుగు తల్లికి జలహారతి

## శాసనసభలో సాగునీటి రంగంపై జరిగిన చర్చలో చంద్రబాబు


**పోలవరం-నల్లమల అనుసంధానంతో రెండు రాష్ట్రాలకూ లాభమేనన్న సీఎం చంద్రబాబు**

**వచ్చే ఏడాది మే 15 నుంచే నారుమళ్లకు నీరందించేలా ప్రణాళికలు సిద్ధం**

**నీళ్లు రాకుండానే వెలిగొండకు రిబ్బన్ కట్ చేసి గత పాలకులు క్రెడిట్ కొట్టేశారు**

**రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులపై త్వరలోనే బ్లూప్రింట్ విడుదల చేస్తామని వెల్లడి**

**ప్రతి ఎకరాకు నీరందించి తెలుగు తల్లికి జలహారతి ఇవ్వడమే లక్ష్యమని స్పష్టీకరణ**



అమరావతి,**ఫిబ్రవరి 26, (ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
పోలవరం-నల్లమల సాగర్ అనుసంధాన ప్రాజెక్టుతో ఏ రాష్ట్రానికీ నష్టం జరగదని, దీనిపై పొరుగు రాష్ట్రం అభ్యంతరాలు వ్యక్తం చేయాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. వృథాగా సముద్రంలోకి పోతున్న గోదావరి వరద జలాలను మాత్రమే ఈ ప్రాజెక్టు ద్వారా తరలిస్తామని ఆయన శాసనసభలో వివరించారు. గోదావరిపై ఎగువ రాష్ట్రం కాళేశ్వరం ప్రాజెక్టు కట్టినప్పుడు తాము ఎన్నడూ అభ్యంతరం చెప్పలేదని గుర్తుచేశారు. ఈ అనుసంధాన ప్రాజెక్టు వల్ల రెండు తెలుగు రాష్ట్రాలకూ మేలు జరుగుతుందని ఆయన అన్నారు. గురువారం నాడు శాసనసభలో సాగునీటి రంగంపై జరిగిన చర్చలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. రాష్ట్రంలో నీటి భద్రతకు కూటమి ప్రభుత్వం దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకెళుతోందని చంద్రబాబు తెలిపారు. 2047 స్వర్ణాంధ్ర విజన్‌లో భాగంగా నీటి భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, పరిశ్రమలు, పెట్టుబడులకు నీరే కీలకమని అన్నారు. రాష్ట్రంలోని జలాశయాల్లో ప్రస్తుతం 793 టీఎంసీల నీరు నిల్వ ఉందని,

మిగతా 2లో.

## ఆదాయం న్యాయబద్ధంగా పంచుకోవాల్సిందే!



**సోషల్ మీడియాకు కేంద్రం కీలక ఆదేశం..**

**కంటెంట్ క్రియేటర్లతో ఆదాయం న్యాయబద్ధంగా పంచుకోవాలని సోషల్ మీడియాకు కేంద్ర మంత్రి సూచన**

**జర్నలిస్టులు, మీడియా సంస్థలతో పాటు అందరికీ న్యాయమైన వాటా దక్కాలన్న అశ్విని వైష్ణవ్**

**డిజిటల్ కంటెంట్ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుందని వెల్లడి**

**డీప్‌ఫేక్‌లు, ఏఐ కంటెంట్‌పై ఇప్పటికే నిబంధనలు కఠినతరం చేస్తున్న కేంద్రం**

2లో.

## ఇజ్రాయెల్-భారత్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం



**యూపీఐ పేమెంట్స్ విషయంలో ఇరు దేశాల మధ్య ఎవోయూ**

**ఏఐ, వ్యవసాయం తదితర రంగాల్లో ఒప్పందాలు**

**ఇజ్రాయిల్ పర్యటనలో ప్రధాని మోడీ ప్రకటన**

**త్వరలోనే ఇండియా వస్తానన్న నెతన్యాహు**

న్యూఢిల్లీ,,**ఫిబ్రవరి 26, (ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
ఇజ్రాయెల్-భారత్ మధ్య త్వరలోనే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదరనుందని ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. అలాగే ఇజ్రాయెల్‌లో కూడా త్వరలో యూపీఐ సేవలను వినియోగించుకోవచ్చని తెలిపారు. ఈ మేరకు యూపీఐ పేమెంట్స్ విషయంలో ఇరు దేశాల మధ్య ఒప్పందం కుదిరింది. యూపీఐ పేమెంట్స్‌తో పాటు ఏఐ,

మిగతా 2లో.

## తెలుగు తప్పనిసరి



**తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం..**

**తెలుగు భాషకు పట్టం కట్టే దిశగా తెలంగాణ ప్రభుత్వం అడుగులు**

**1 నుంచి 10వ తరగతి వరకు తెలుగు కచ్చితంగా బోధించాలని ఆదేశాలు**

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక**

రాష్ట్రంలోని విద్యావ్యవస్థలో మాతృభాష తెలుగుకు పూర్వవైభవం తీసుకువచ్చే దిశగా తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. భవిష్యత్ తరాలకు తెలుగు భాషా సౌరభాన్ని

మిగతా 2లో.

## లొంగిపోయిన ముప్పిడి అవినాశ్

**ఏపీ మద్యం కుంభకోణం కేసులో నిందితుడు అవినాశ్ రెడ్డి సిట్ ముందు లొంగుబాటు**

**వైసీపీ హయాంలో జరిగిన రూ.3,500 కోట్ల స్కాంలో ఈయన ఏ7 నిందితుడు**

**ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ నేతృత్వంలో కొనసాగుతున్న సిట్ దర్యాప్తు**

అమరావతి,**ఫిబ్రవరి 26, (ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
ఏపీ మద్యం కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఏడో నిందితుడిగా ఉన్న ముప్పిడి అవినాశ్ రెడ్డి ఇవాళ విజయవాడలోని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఎదుట లొంగిపోయారు. ముందస్తు బెయిల్ మంజూరు చేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించి, ఈ నెల 26లోగా లొంగిపోవాలని ఆదేశించిన రెండు రోజులకే ఆయన సిట్ విచారణకు హాజరయ్యారు.

మిగతా 2లో.



## భారతీయ విద్యాభవన్ తరహాలో స్కూళు

**మౌళిక వసతులతో పాటు..బ్రేక్‌ఫాస్ట్**

**విజయ డెయిరీ ద్వారా అవసరమైన పాల సరఫరా**

**రవాణా కోసం ఎలక్ట్రిక్ బస్సుల వినియోగం**

**ప్రైవేట్ స్కూళ్ల ఫీజులకు కళ్లెం వేసేలా చర్యలు**

**విద్యారంగంపై సమీక్షలో సిఎం రేవంత్ కీలక ఆదేశాలు**

హైదరాబాద్,,**ఫిబ్రవరి 26, (ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
కోర్ అర్బన్ రీజియన్‌లో ప్రభుత్వ స్కూల్స్‌లో మౌలిక సదుపాయాల కల్పనపైన దృష్టి సారించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణంలో రాజీ పడొద్దని స్పష్టం చేశారు. భారతీయ విద్యా భవన్,

మిగతా 2లో.




## రాయలసీమ ఎత్తిపోతల పై మండలిలో వాగ్వాదం

### జగన్ చేతకానితనం వల్లే సీమ లిఫ్ట్ ఆగింది : మంత్రుల ధ్వజం

**సీమకు ఐదేళ్లలో జగన్ చేసిందేమీ లేదని, ఆయనో రాయలసీమ ద్రోహి అని విమర్శ**

**శాసనమండలిలో సోము వీర్రాజుపైకి దూసుకెళ్లిన వైసీపీ సభ్యులు... సభ వాయిదా**

అమరావతి,**ఫిబ్రవరి 26, (ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
శాసనమండలిలో రాయలసీమ ఎత్తిపోతల పథకం (రాయలసీమ లిఫ్ట్) అంశంపై అధికార, విపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. వైసీపీ ప్రభుత్వ హయాంలోనే నిలిచిపోయిన ఈ ప్రాజెక్టుపై ఇప్పుడు తమను ప్రశ్నించడం ఏంటని కూటమి ప్రభుత్వ మంత్రులు వైసీపీ సభ్యులపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. నాలుగేళ్ల పాటు ఆగిపోయిన పనులకు



మిగతా 2లో.




## తెలంగాణలో 45 మంది ఐఏఎస్ ల బదిలీ

**రాహుల్ బొజ్జాకు సాధారణ పరిపాలన శాఖ బాధ్యతలు**

**పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సంజయ్ కుమార్**

**యాదాద్రి భువనగిరి జిల్లా కొత్త కలెక్టర్‌గా అనురాగ్ జయంతి**

హైదరాబాద్,,**ఫిబ్రవరి 26, (ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
తెలంగాణ ప్రభుత్వ యంత్రాంగంలో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. పరిపాలనను మరింత వేగవంతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం 45 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ బదిలీలలో భాగంగా అత్యంత కీలకమైన సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) బాధ్యతలను రాహుల్ బొజ్జాకు అప్పగించారు.

మిగతా 2లో.

## న్యాయవ్యవస్థపై ఎన్‌సీఈఆర్‌టీ 'కుట్ర'..


**సుప్రీంకోర్టు సంచలన తీర్పు!**

**వివాదాస్పద పాఠ్యపుస్తకంపై తక్షణ నిషేధం**

**బేషరతుగా క్షమాపణలు చెప్పిన కేంద్రం**

**అవినీతి పాఠ్యాంశంపై కఠిన చర్యలు..**

**మార్చి 11న తదుపరి విచారణకు ఆదేశం**



న్యూఢిల్లీ,,**ఫిబ్రవరి 26, (ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను మంటగలిపేలా పాఠ్యపుస్తకాల్లో అభ్యంతరకర అంశాలను ప్రచురించిన ఎన్‌సీఈఆర్‌టీకి సుప్రీంకోర్టు గట్టి షాక్ ఇచ్చింది. ఎనిమిదో తరగతి సామాజిక శాస్త్ర పుస్తకంలో న్యాయవ్యవస్థలోని అవినీతిపై చేర్చిన అధ్యాయాన్ని తీవ్రంగా పరిగణించిన అత్యున్నత న్యాయస్థానం.. ఆ పుస్తకంపై తక్షణ నిషేధం విధిస్తూ ఉత్తర్వులు జారీ

మిగతా 2లో.

# లొంగిపోయిన ముప్పిడి అవినాశ్

మొదటిపేజీ తరువాయి

భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం, అవినాశ్ రెడ్డి కచ్చితంగా లొంగిపోయి దర్యాప్తునకు సహకరించాలని స్పష్టం చేసింది. అరెస్టు నుంచి రక్షణ కల్పించాలన్న ఆయన అభ్యర్థనను తిరస్కరించింది. అయితే, ట్రయల్ కోర్టులో రెగ్యులర్ బెయిల్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు స్వేచ్ఛనిచ్చింది. అంతకుముందు ఏపీ హైకోర్టు ఆయన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేయడంతో అవినాశ్ రెడ్డి సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో (2019-24) ఎక్సైజ్ పాలసీని మార్చి, డిస్టిలరీల నుంచి ముడుపులు స్వీకరించడం ద్వారా సుమారు రూ.3,500 కోట్ల కుంభకోణం జరిగిందని ప్రధాన ఆరోపణ. మద్యం సరఫరాదారుల నుంచి కమీషన్ల రూపంలో వసూలు చేసిన డబ్బును అవినాశ్ రెడ్డి విదేశాలకు తరలించి మనీలాండరింగ్‌కు పాల్పడ్డారని అభియోగాలు నమోదయ్యాయి. ఆయన దేశం విడిచి పారిపోయాడని, ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డి ఇందుకు సహకరించాడని ప్రాసిక్యూషన్ గతంలో కోర్టుకు తెలిపింది.2024లో టీడీపీ-ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ కుంభకోణంపై కేసు నమోదైంది. తొలుత ఎక్సైజ్ శాఖ అధికారి ఫిర్యాదుతో సీఐడీ దర్యాప్తు ప్రారంభించగా, తర్వాత ప్రభుత్వం కేసును లోతుగా విచారించేందుకు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు నేతృత్వంలో సిట్‌ను ఏర్పాటు చేసింది. ఈ కేసులో ఐపీసీ, అవినీతి నిరోధక చట్టంలోని పలు సెక్షన్ల కింద మంగళగిరి సీఐడీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.వైసీపీ నేతలు తమకు అనుకూలమైన నూతన మద్యం పాలసీని ప్రోత్సహించి, కొత్త బ్రాండ్లను ప్రవేశపెట్టి, డిస్టిలరీ కంపెనీల నుంచి ముడుపులు స్వీకరించారని, తద్వారా ప్రభుత్వ ఖజానాకు భారీ నష్టం కలిగించారని సిట్ దర్యాప్తులో తేలినట్లు సమాచారం. ఈ కేసులో పలువురు ఎంపీలు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు, డిస్టిలరీ కంపెనీల యజమానులను కూడా సిట్ నిందితులుగా చేర్చింది. అవినాశ్ రెడ్డి లొంగుబాటుతో ఈ కేసు దర్యాప్తు మరింత వేగవంతం అయ్యే అవకాశం ఉంది.

## తెలంగాణలో 45 మంది ఐఏఎస్ ల బదిలీ

మొదటిపేజీ తరువాయి

ఆయన జీఏడీ ముఖ్యకార్యదర్శిగా వ్యవహరిస్తూనే, బీసీ సంక్షేమ శాఖ అదనపు బాధ్యతలను కూడా చూసుకోనున్నారు.సీనియర్ అధికారుల బాధ్యతల్లోనూ ప్రభుత్వం పలు మార్పులు చేసింది. పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సంజయ్ కుమార్‌ను, రెవెన్యూ మరియు విపత్తు నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా దాన కిషోర్‌ను నియమించింది. ఆర్థిక మరియు ప్రణాళికా విభాగం కార్యదర్శిగా గౌరవ్ ఉప్పల్ బాధ్యతలు చేపట్టనుండగా, దేవాలయాల పర్యవేక్షణ బాధ్యతను ఎం. హనుమంతరావుకు (దేవదాయ శాఖ కమిషనర్) అప్పగించారు.ప్రజల సమస్యల పరిష్కార వేదిక 'ప్రజావాణి' రాష్ట్ర నోడల్ అధికారిగా డి. దివ్యను నియమించడం గమనార్హం. కేవలం సచివాలయ స్థాయిలోనే కాకుండా జిల్లాల పాలనలోనూ ప్రభుత్వం ప్రక్షాళన చేపట్టింది. పలు జిల్లాల కలెక్టర్లను మారుస్తూ తీసుకున్న నిర్ణయంలో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా కొత్త కలెక్టర్‌గా అనురాగ్ జయంతి నియమితులయ్యారు. ఈ భారీ బదిలీల ద్వారా పాలనలో కొత్త ఉత్తేజం తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది.

## తెలుగు తప్పనిసరి

మొదటిపేజీ తరువాయి

అందించడమే లక్ష్యంగా, వచ్చే 2026-27 విద్యా సంవత్సరం నుండి రాష్ట్రంలోని అన్ని రకాల పాఠశాలల్లో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు తెలుగును కచ్చితంగా ఒక సబ్జెక్టుగా బోధించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కేవలం స్టేట్ బోర్డు పాఠశాలలకే పరిమితం కాకుండా, సీబీఎస్ఈ (జదీూజు), ఐసీఎస్ఈ (×జూజు), ఐబీ (×దీ) వంటి అంతర్జాతీయ ప్రమాణాలతో నడిచే ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లోనూ మాతృభాషను కచ్చితంగా అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

ప్రస్తుతం అనేక కార్పొరేట్ పాఠశాలల్లో మార్కుల వేటలో పడి తెలుగును విస్మరిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. కేవలం స్కోరింగ్ కోసమే అరబిక్, సంస్కృతం వంటి భాషలకు ప్రాధాన్యతనిస్తూ, తెలుగును అటకెక్కిస్తున్న తీరుపై ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు కనీసం తెలుగులో చిన్న వాక్యాన్ని కూడా సరిగ్గా చదవలేకపోవడం భాషా సంక్షోభానికి దారితీస్తోందని గుర్తించిన సర్కారు, తెలుగు తప్పనిసరి అమలు చట్టం-2018ని కఠినంగా అమలు చేసేందుకు సిద్ధమైంది. గతంలో కోవిడ్ కారణంగా 9, 10 తరగతులకు ఇచ్చిన మినహాయింపులను రద్దు చేస్తూ, 2025-26లో 9వ తరగతికి, 2026-27 నాటికి 10వ తరగతికి ఈ నిబంధనను వర్తింపజేయనుంది.

అయితే, విద్యార్థులపై పనిభారం పడకుండా ప్రభుత్వం ఒక వినూత్న మార్పును ప్రవేశపెట్టింది. ఇతర బోర్డుల విద్యార్థుల కోసం కఠినమైన 'సింగిడి' పుస్తకాలకు బదులుగా, అత్యంత సరళంగా ఉండే 'వెన్నెల' పాఠ్యపుస్తకాలను రూపొందించింది. కేవలం ఇతర రాష్ట్రాల నుండి వచ్చి 8వ తరగతి ఆపై తరగతుల్లో చేరే విద్యార్థులకు మాత్రమే ఈ నిబంధన నుండి మినహాయింపు ఉంటుంది. నిబంధనలు ఉల్లంఘించే పాఠశాలలపై భారీ జరిమానాలు విధిస్తామని, చట్టపరమైన చర్యలు తప్పవని ప్రభుత్వం హెచ్చరించింది. ప్రతి పాఠశాల తగినంత మంది తెలుగు ఉపాధ్యాయులను నియమించుకోవాలని, ఎస్‌సీఈఆర్‌టీ (ూజజు=) నిర్దేశించిన పుస్తకాలనే బోధించాలని స్పష్టం చేయడంతో, రాష్ట్రవ్యాప్తంగా తెలుగు భాషకు కొత్త ఊపిరి పోసినట్లయింది.

## తెలుగు తల్లికి జలహారతి

మొదటిపేజీ తరువాయి

అందుకే ఈసారి పంటల సీజన్‌ను ముందుకు జరిపి, వచ్చే ఏడాది మే 15 నుంచే నారుమళ్లకు నీరందించేలా ప్రణాళిక రచించామని ప్రకటించారు. ఈ విషయంపై రైతులను చైతన్యవంతం చేయాలని ప్రజాప్రతినిధులకు ఆయన సూచించారు. ప్రతి ఎకరాకు నీరందించి తెలుగు తల్లికి జలహారతి ఇవ్వడమే తన లక్ష్యమని, దీనికోసం రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల పూర్తిపై త్వరలోనే ఒక బ్లూప్రింట్ విడుదల చేస్తామని వెల్లడించారు.

**ప్రాజెక్టులన్నీ మా హయాంలో కట్టినవే**

రాష్ట్రంలో నిర్మించిన ప్రాజెక్టులన్నీ తమ హయాంలోనివేనని చంద్రబాబు స్పష్టం చేశారు. 2014-19 మధ్య సాగునీటి రంగానికి రూ.68 వేల కోట్లు ఖర్చు చేశామని గుర్తుచేశారు. ఎన్టీఆర్ హయాంలోనే రాయలసీమకు తెలుగు గంగ, గాలేరు నగరి, హంద్రీనీవా వంటి ప్రాజెక్టులు వచ్చాయని, తాము పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు నీళ్లిచ్చి, శ్రీశైలంలో 100 టీఎంసీలు రాయలసీమకు తరలించామని వివరించారు. అందుకే ఆ ప్రాంతం నేడు రతనాల సీమగా మారుతోందన్నారు.

**వెలిగొండపై గత పాలకుల క్రెడిట్ చోరీ**

గత ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. వెలిగొండ ప్రాజెక్టుకు నీళ్లు రాకుండానే రిబ్బన్ కట్ చేసి క్రెడిట్ కొట్టేసే ప్రయత్నం చేశారని ఎద్దేవా చేశారు. 30 ఏళ్ల క్రితం శంకుస్థాపన చేసిన ఆ ప్రాజెక్టు మొదటి దశను ఈ ఏడాది జూలైలోనే పూర్తి చేసి నీళ్లిస్తామని హామీ ఇచ్చారు. ప్రాజెక్టు పూర్తికి మరో రూ.2500 కోట్లు అవసరమని, ఇప్పటికే ఫీడర్ కెనాల్ లైనింగ్ పనులకు రూ.456 కోట్లతో శంకుస్థాపన చేశామని తెలిపారు. అదేవిధంగా కుప్పం కాలువలో ట్యాంకర్లతో నీళ్లు పోసి ప్రచారం చేసుకున్నారని విమర్శించారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును విధ్వంసం చేసి డయాఫ్రాం వాల్‌ను గోదావరిలో కలిపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ప్రాజెక్టును మళ్లీ పరుగులు పెట్టించి పుష్కరాల కంటే ముందే పూర్తి చేస్తామన్నారు.

**ప్రాజెక్టుల్లో పుష్కలంగా నీరు**

ప్రస్తుతం రాష్ట్రంలోని జలాశయాలు 793 టీఎంసీల నీటితో కళకళలాడుతున్నాయని సీఎం తెలిపారు. జల సంరక్షణ చర్యల వల్ల రాష్ట్రవ్యాప్తంగా భూగర్భ జలాలు సగటున 6 మీటర్లు పెరిగాయని, దీనివల్ల రూ.91 కోట్ల విద్యుత్ ఆదా అయిందని వివరించారు. తాను చేయని తప్పుకు 53 రోజులు జైల్లో పెట్టారని, అయినా రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు నీరివ్వాలన్న సంకల్పంతో పనిచేస్తున్నానని అన్నారు. నీటి భద్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని, కొందరు కేవలం రాజకీయం కోసమే నీటి సమస్యలను సృష్టిస్తున్నారని విమర్శించారు. ప్రతి ఇంటికీ తాగునీరు, ప్రతి ఎకరాకు సాగునీరు, పరిశ్రమలకు నీరు అందించడమే లక్ష్యంగా ముందుకెళతామని చంద్రబాబు పునరుద్ఘాటించారు.

## ముందస్తు చర్యలే ముఖ్యం: సీఎం చంద్రబాబు

"ఘటన జరిగాక స్పందించడం వల్ల పెద్దగా ఉపయోగం ఉండదు. ముందస్తు పర్యవేక్షణ, అప్రమత్తత ద్వారా ఈ తరహా ఘటనలు జరగకుండా చూడాలి. శ్రీకాకుళంలో తాగునీరు కలుషితమైన ఘటనలో ముందస్తు తనిఖీలు జరిగి ఉంటే ఈ సమస్య వచ్చేదే కాదు" అని అభిప్రాయపడ్డారు. జిల్లా కలెక్టర్లు, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు చేపట్టడం ద్వారా ఇలాంటి ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు.

# ఆదాయం న్యాయబద్ధంగా పంచుకోవాల్సిందే!

**సోషల్ మీడియాకు కేంద్రం కీలక ఆదేశం..**

న్యూఢిల్లీ,,ఫిబ్రవరి 26, (ప్రజా రిపబ్లిక్ న్యూస్)

సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు తమ ఆదాయాన్ని కంటెంట్ సృష్టించేవారితో న్యాయబద్ధంగా పంచుకోవాలని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ స్పష్టం చేశారు. జర్నలిస్టులు, సంప్రదాయ మీడియా సంస్థలు, ఇన్‌ఫ్లుయెన్సర్లు, విద్యావేత్తలు, పరిశోధకులు ఇలా ఎవరైనా సరే, కంటెంట్ సృష్టిస్తే వారికి ఆదాయంలో సరైన వాటా దక్కాల్సిందేనని ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు.ఈ ప్లాట్‌ఫామ్‌లు ఇతరులు అప్‌లోడ్ చేసే కంటెంట్ ద్వారా గణనీయంగా ప్రయోజనం పొందుతున్నాయని, అందుకే కంటెంట్ సృష్టికర్తలకు కూడా వారి సరైన వాటా దక్కాలని ఆయన పేర్కొన్నారు. మారుమూల ప్రాంతాల్లోని కంటెంట్ క్రియేటర్ల నుంచి మొదలుకొని, తమ పరిశోధనలను పంచుకునే ప్రొఫెసర్ల వరకు అందరికీ ఈ న్యాయం జరగాలన్నారు. ఆదాయ పంపిణీలో న్యాయబద్ధతను తీసుకురావడం ద్వారా దేశంలో డిజిటల్ కంటెంట్ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.

డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల జవాబుదారీతనం, పారదర్శకతను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం నిబంధనలను కఠినతరం చేస్తున్న తరుణంలో మంత్రి ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఇదిలా ఉంటే.. ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ (మీవత్) గతేడాది ఐటీ రూల్స్-2021కి కీలక సవరణలు ప్రతిపాదించింది. పెరిగిపోతున్న డీప్‌ఫేక్‌లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా సృష్టించిన తప్పుడు సమాచారాన్ని అరికట్టడమే ఈ సవరణల లక్ష్యం. ఈ ముసాయిదా నిబంధనల ప్రకారం ఫేస్‌బుక్, యూట్యూబ్, స్నాప్‌చాట్ వంటి పెద్ద సోషల్ మీడియా సంస్థలు (50 లక్షలకు పైగా వినియోగదారులు ఉన్నవి) ఏఐ ఆధారిత కంటెంట్‌ను స్పష్టంగా లేబుల్ చేయాలి.వీడియోలు లేదా చిత్రాలైతే కనీసం 10 శాతం డిస్‌ప్లేను, ఆడియో అయితే మొదటి 10 శాతం వ్యవధిని ఈ లేబుల్ కవర్ చేయాలి. ఈ కంటెంట్‌కు శాశ్వత మెటాడేటా లేదా ఐడెంటిఫైయర్ జోడించాలని, దానిని మార్చడానికి లేదా తొలగించడానికి వీల్లేదని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. ఒకవేళ ఏదైనా ప్లాట్‌ఫామ్ ఉద్దేశపూర్వకంగా లేబుల్ లేని ఏఐ కంటెంట్‌ను అనుమతిస్తే, అది ఐటీ చట్టం ప్రకారం 'తగిన శ్రద్ధ' (ఒబవ ఒఱశ్రీఱస్త్రవఅఛవ) పాటించడంలో విఫలమైనట్లు పరిగణించబడుతుంది.

# రాయలసీమ ఎత్తిపోతల పై మండలి లో వాగ్వాదం

ం సమాధానం చెప్పకుండా, ఇప్పుడు ప్రభుత్వంపై బురద చల్లడమేంటని నిలదీశారు.ఈ సందర్భంగా మంత్రులు నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడు మాట్లాడుతూ వైసీపీ తీరును తీవ్రంగా ఎండగట్టారు. "రాయలసీమ లిఫ్ట్ పనులు 2020లోనే జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్జీటీ) ఆదేశాలతో ఆగిపోయాయి. ఈ విషయాన్ని నాటి తెలంగాణ మంత్రి హరీశ్ రావు స్వయంగా ప్రకటించారు. అలాంటప్పుడు, నాలుగేళ్లుగా అధికారంలో ఉన్న జగన్ ప్రభుత్వం ఏం చేసింది? కనీసం కౌంటర్ కూడా దాఖలు చేయకుండా నిర్లక్ష్యం వహించింది మీ అసమర్థత కాదా?" అని పయ్యావుల కేశవ్ ప్రశ్నించారు. ఐదేళ్ల పాలనలో రాయలసీమ ప్రాజెక్టులను నిర్వీర్యం చేసి, ప్రాజెక్టులు కొట్టుకుపోవడానికి కారణమైన జగన్ రెడ్డి ఓ రాయలసీమ ద్రోహి అని వారు అభివర్ణించారు.తమ ప్రభుత్వం రాయలసీమ అభివృద్ధికి కట్టుబడి ఉందని మంత్రులు స్పష్టం చేశారు. "రూ.12 లక్షల కోట్ల బడ్జెట్‌లో వైసీపీ ప్రభుత్వం సీమకు 1 శాతం నిధులు కూడా ఖర్చు చేయలేదు. కానీ, మేం హంద్రీనీవా పనులు పూర్తి చేసి 190 రోజుల్లోనే 44 టీఎంసీల నీటిని తరలించాం. ప్రస్తుతం రాయలసీమ ప్రాజెక్టుల్లో 366 టీఎంసీల నీటిని నిల్వ చేశాం. ఇది మా నాయకుడు చంద్రబాబు సమర్థతకు నిదర్శనం" అని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేవలం 20 నెలల్లోనే రూ.8 వేల కోట్లు ఖర్చు చేసిందని, తాజా బడ్జెట్‌లో మరో రూ.10,014 కోట్లు కేటాయించిందని వివరించారు.వైసీపీ ప్రభుత్వం జీఓ 365 తెచ్చి 102 సాగునీటి ప్రాజెక్టులను రద్దు చేసిందని, గోరుకల్లు, గాలేరు-నగరి వంటి ప్రాజెక్టులను పూర్తిగా విస్మరించిందని మంత్రులు ఆరోపించారు. "మీ దరిద్రపు పాలనలో, మీ అసమర్థ నాయకుడి చేతకానితనం వల్లే రాయలసీమ లిఫ్ట్ ఆగిపోయింది. ఆ నిజాన్ని కప్పిపుచ్చి ఇప్పుడు డ్రామాలు ఆడుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాయలసీమను రతనాల సీమగా మార్చేందుకు ఒక యజ్ఞంలా పనిచేస్తుంటే, వైసీపీ నేతలు రాక్షసుల్లా అడ్డుపడుతున్నారు" అని మంత్రి అచ్చెన్నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ హయాంలో నిలిచిపోయిన పనులకు మమ్మల్ని బాధ్యులను చేసే ప్రయత్నాన్ని మానుకోవాలని వారు హితవు పలికారు.

**వీర్రాజుపై దాడికి యత్నించిన వైసీపీ సభ్యులు**

ఆంధ్రప్రదేశ్ శాసనమండలి రణరంగాన్ని తలపించింది. రాయలసీమ ఎత్తిపోతల పథకంపై చర్చ సందర్భంగా అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య చెలరేగిన వివాదం చివరకు తోపులాట వరకు వెళ్లడంతో సభలో ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది. మంత్రి నిమ్మల రామానాయుడు సమాధానం ముగిసిన తర్వాత, ఈ అంశంపై మరింత చర్చ జరపాలని వైసీపీ సభ్యులు పట్టుబట్టడంతో గందరగోళం మొదలైంది. అయితే, మంత్రి వివరణ పూర్తయిందని స్పష్టం చేసిన మండలి ఛైర్మన్ మోషేనురాజు... తదుపరి ప్రశ్నకు అవకాశం కల్పించారు. ఈ తరుణంలో బీజేపీ ఎమ్మెల్సీ సోము



వీర్రాజు మాట్లాడేందుకు ప్రయత్నించగా... వైసీపీ సభ్యులు అడ్డుకున్నారు.తమ నిరసన కొనసాగుతుండగానే సోము వీర్రాజుకు మైక్ ఎలా ఇస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేసిన వైసీపీ ఎమ్మెల్సీ ఇజ్రాయెల్ తదితరులు ఒక్కసారిగా వీర్రాజు సీటు వైపు దూసుకెళ్లారు. కేవలం వాగ్వాదానికే పరిమితం కాకుండా, ఆయనపై దాడికి యత్నించడంతో సభలో కలకలం రేగింది. పరిస్థితి విషమిస్తుండటంతో అప్రమత్తమైన మంత్రులు అనిత, గొట్టిపాటి రవికుమార్ వెంటనే సోము వీర్రాజుకు అండగా నిలబడి, వైసీపీ సభ్యులను అడ్డుకున్నారు. ఇరుపక్షాల మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వివాదం జరగడం, సభ్యులు ఒకరిపై ఒకరు దూసుకురావడంతో సభ నియంత్రణ తప్పింది. ఈ క్రమంలో పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో ఛైర్మన్ మోషేనురాజు సభను ేవాయిదా వేశారు.

# న్యాయవ్యవస్థపై ఎన్‌సీఈఆర్‌టీ 'కుట్ర'..

మొదటిపేజీ తరువాయి

ఇది కేవలం పొరపాటు కాదు న్యాయవ్యవస్థను కించపరిచేలా చేసిన ఉద్దేశపూర్వక కుట్ర అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

**బుల్లెట్ తగిలి రక్తం చిందిస్తోంది: సీజేఐ**

విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అత్యంత ఘాటైన పదజాలంతో విరుచుకుపడ్డారు. "ఎన్‌సీఈఆర్‌టీ ప్రయోగించిన బుల్లెట్‌తో న్యాయవ్యవస్థ రక్తం చిందిస్తోంది. కోర్టుల విశిష్ట చరిత్రను వివరించాల్సింది పోయి వ్యవస్థను అణచివేసేలా పాఠాలు రాయడం సరికాదు" అని మండిపడ్డారు. యువత మనసుల్లో న్యాయవ్యవస్థ పట్ల అగౌరవం కలిగించేలా ఈ పాఠ్యాంశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. బాధ్యులెవరో తేలేవరకు ఈ విషయాన్ని వదిలిపెట్టబోమని, జవాబుదారీతనం ఉండాల్సిందేనని స్పష్టం చేశారు.

**కేంద్రం బేషరుతు క్షమాపణ**

కోర్టు ఆగ్రహాన్ని గమనించిన కేంద్ర ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా బేషరుతుగా క్షమాపణలు కోరారు. ఈ పాఠ్యాంశాన్ని ప్రభుత్వం ఏమాత్రం సమర్థించడం లేదని, పబ్లిక్ నోటీసు ద్వారా క్షమాపణలు చెబుతామని వెల్లడించారు. ఇప్పటికే వివాదాస్పద పుస్తకాల పంపిణీని నిలిపివేసి, వెబ్‌సైట్ నుంచి కూడా ఆ పాఠాలను తొలగించామని కోర్టుకు వివరించారు.

**కఠిన చర్యలకు ఆదేశం**

ఈ వ్యవహారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎన్‌సీఈఆర్‌టీ డైరెక్టర్, స్కూల్ ఎడ్యుకేషన్ సెక్రటరీకి కోర్టు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. క్రమశిక్షణ చర్యలు ఎందుకు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. కాగా, సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, అభిషేక్ సింఘ్వీలు ఈ వివాదాన్ని కోర్టు దృష్టికి తీసుకురావడంతో సుప్రీంకోర్టు దీనిని సుమోటోగా స్వీకరించి విచారణ చేపట్టింది. ఈ కేసులో తదుపరి పరిణామాలు మార్చి 11న జరిగే విచారణలో వెల్లడికానున్నాయి.

# ఇజ్రాయెల్-భారత్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

మొదటిపేజీ తరువాయి

వ్యవసాయం తదితర రంగాల్లో ఒప్పందాలు కుదిరాయి. రెండు దేశాల మధ్య త్వరలోనే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం జరగనున్నట్టు ఇరు దేశాల ప్రధానులు సంయుక్త ప్రకటనలో వెల్లడించారు. మొత్తం 27 రంగాల్లో పరస్పర సహకారానికి ఇరు దేశాలు అంగీకరించాయి. మరోవైపు గాజాపై ప్రధాని మోదీ మరోసారి భారత్ వైఖరిని స్పష్టం చేశారు. మానవత్వం ఎప్పుడూ సంఘర్షణకు బలికాకూడదని అన్నారు. ప్రస్తుతం శాంతి ప్రణాళిక ద్వారా ఓ ముందడుగు పడిందని, ఈ ప్రయత్నాలకు భారత్ పూర్తి మద్దతుగా నిలుస్తుందని మోదీ హామీ ఇచ్చారు. ఃూగా, త్వరలోనే భారత పర్యటనకు రావాల్సిందిగా ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహును ఆహ్వానించారు. అంతకు ముందు ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో ప్రధాని మోదీ చేసిన ప్రసంగాన్ని నెతన్యాహు ప్రశంసించారు. ఆయన ప్రసంగం ప్రతి ఒక్కరినీ కదిలించిందని అన్నారు. భారత్‌కు రుణపడి ఉన్నామని అన్నారు. మోదీ తమకు స్నేహితుడు కంటే ఎక్కువని అభివర్ణించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇజ్రాయెల్ పర్యటన రెండు దేశాల మధ్య సరికొత్త మైత్రికి నాంది పలికింది. విమానాశ్రయం నుంచి ఇజ్రాయెల్ పార్లమెంట్ వరకు మోడీకి లభించిన ఘన స్వాగతం ఈ పర్యటన ప్రాధాన్యతను చాటిచెప్పింది. పర్యటనలో భాగంగా నిర్వహించిన సంయుక్త విలేకరుల సమావేశంలో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు తన వ్యక్తిగత విషయాన్ని ఒకటి పంచుకొని అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ సందర్భంగా ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి నెతన్యాహు మాట్లాడుతూ.. తన భార్యతో తన మొదటి డేట్ ఒక భారతీయ రెస్టారెంట్‌లో జరిగిందని, ఆ భోజనం అద్భుతంగా ఉండటం వల్లే వారి బంధం బలపడిందని సరదాగా వ్యాఖ్యానించారు. దీనికి తాను, తన పిల్లలు కూడా భారత్‌కు రుణపడి ఉంటామని ఆయన అనగానే ప్రధాని మోడీ నవ్వు ఆపుకోలేక పోయారు. భారతదేశంలోని అపారమైన ప్రతిభను, ఇజ్రాయెల్‌లోని సాంకేతిక పరిజ్ఞానాన్ని కలపడం ద్వారా అద్భుతాలు సృష్టించవచ్చని ఇద్దరు నేతలు ఆకాంక్షించారు. ప్రధానంగా కచ్చితమైన వ్యవసాయం, సాఫ్ట్‌వేర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నారు. ఆవిష్కరణలు,
సాంకేతికత, అభివృద్ధికి సంబంధించి రెండు దేశాల మధ్య 16 కీలక అవగాహన ఒప్పందాలు జరిగాయి.

రెండు దేశాల మధ్య స్నేహాన్ని మరింత బలోపేతం చేసేందుకు త్వరలోనే భారత్‌లో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని నేతలు నిర్ణయించారు. 'మా వ్యక్తిగత స్నేహం, ప్రభుత్వాల మధ్య సహకారం, ప్రజల మధ్య అనుబంధం నానాటికీ బలపడుతోంది' అని నెతన్యాహు ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. దీనిని కొనసాగించేందుకు సాధ్యమైనంత త్వరగా భారతదేశంలో ఒక ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పర్యటన కేవలం దౌత్యపరమైన ఒప్పందాలకు మాత్రమే పరిమితం కాకుండా, ఇద్దరు దేశాధినేతల మధ్య ఉన్న బలమైన వ్యక్తిగత స్నేహాన్ని ప్రపంచానికి చాటిచెప్పింది.

# భారతీయ విద్యాభవన్ తరహాలో స్కూళ్లు

మొదటిపేజీ తరువాయి

జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూళ్లల్లో ఉన్న మౌలిక సదుపాయాలు ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఉండాలని సూచించారు. గురువారం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌పైన సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై సీఎం దిశానిర్దేశర చేశారు. ఈ సమావేశానికి సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీ, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణా రెడ్డి , విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా , కళాశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన, ఉస్మానియా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కుమార్, అంబేద్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో బ్రేక్ ఫాస్ట్ స్కీమ్‌ను పకడ్బందీగా అమలు చేయాలని మార్గనిర్దేశం చేశారు. బ్రేక్ ఫాస్ట్ స్కీమ్‌లో తప్పనిసరిగా పాలు అందజేయాలని నిర్దేశిరచారు. ఇందుకోసం విజయా డైరీ నుంచి పాలు సేకరించాలని సూచించారు. మధ్యాహ్న భోజనం నాణ్యత కోసం ఏఐ టెక్నాలజీని వినియోగించాలని దిశానిర్దేశర చేశారు. కోర్ అర్బన్ రీజియన్ మినహా మిగిలిన నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్ట్ కింద ఒక్కొక మండలంలో ఆరుట్ల స్కూల్ తరహాలో ట్రాన్స్‌పోర్ట్‌తో సహా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ట్రాన్స్‌పోర్ట్ కోసం ఎలక్ట్రికల్ బస్సుల ఏర్పాటు పైన అధ్యాయనం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ప్రైవేట్ స్కూల్స్‌లో నిబంధనలకు మించి ఫీజులు వసూలు చేస్తే అనుమతి రద్దుతో పాటు రికవరీ చేసేలా నిబంధన విధించాలని హుకుం జారీ చేశారు. ప్రైవేట్ స్కూల్స్‌లో ఫీజుల నియంత్రణకు సంబంధించి రికమండేషన్స్‌ని ప్రజాభిప్రాయం కోసం వెబ్‌సైట్‌లో ఉంచాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

# ఏపీ సీఎస్‌పై హైకోర్టు తీవ్ర ఆగ్రహం..

## జైలుకు పంపాల్సి వస్తుందని హెచ్చరిక..!!




**ఏపీ బ్యూరో, ఫిబ్రవరి 26 - (రిపబ్లిక్ న్యూస్) -** ఏపీ సీఎస్‌పై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) విజయానందును ఉద్దేశించి ధర్మాసనం తీవ్ర వ్యాఖ్యలు చేస్తూ జైలుకు పంపాల్సి వస్తుందని హెచ్చరించారు. గ్రూప్-1 కేసులో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆదేశాల అమలులో జాప్యంపై ధర్మాసనం నిప్పులు చెరిగింది. కోర్టు ధిక్కరణ కింద జైలుకు పంపాల్సి వస్తుందని తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. ప్రభుత్వ వాదనను తోసిపుచ్చి, గురువారానికి ధర్మాసనం గడువు విధించింది. ఇక విషయానికెళ్తే వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన గ్రూప్-1 నియామకాల కేసులో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) విజయానంద్‌పై హైకోర్టు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ఆదేశాల అమలులో తీవ్ర జాప్యం చేయడంపై బుధవారం జరిగిన విచారణలో ధర్మాసనం నిప్పులు చెరిగింది. "తక్షణం అనే పదానికి అర్థం తెలియదా" అని ఘాటుగా ప్రశ్నిస్తూ కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని గట్టిగా హెచ్చరించింది. గతంలో ఇచ్చిన ఆదేశాల ప్రకారం గ్రూప్-1 ద్వారా ఎంపికైన వారిని దర్యాప్తును ప్రభావితం చేయని అప్రాధాన్య (నాన్-ఫోకల్) పోస్టుల్లోకి తక్షణం బదిలీ చేయాలని కోర్టు స్పష్టం చేసింది. అయితే ఆ ఆదేశాలు అమలు కాకపోవడంపై ధర్మాసనం సీఎస్‌ను నిలదీసింది. "మీరు పదవీ విరమణకు దగ్గరగా ఉన్నారు. మిమ్మల్ని నాలుగు రోజులు జైల్లో ఉంచితే మిగిలిన అధికారులు దారిలోకొస్తారు. కోర్టు ఆదేశాలను సీఎస్ గౌరవించకపోతే కింది స్థాయి అధికారులు ఏం నేర్చుకుంటారని ధర్మాసనం మండిపడింది. డిప్యూటీ కలెక్టర్లు, డీఎస్పీల వంటి కీలక పోస్టుల్లో ఉన్నవారిని బదిలీ చేయడానికి ఇబ్బందేంటని ప్రశ్నించింది. "అభ్యర్థులు మిమ్మల్ని మేనేజ్ చేశారా. లేక మీరు వారితో కుమ్మక్కయ్యారా అంటూ సూటిగా ప్రశ్నించింది. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) వాదనలు వినిపిస్తూ ఫోకల్, నాన్ - ఫోకల్ పోస్టుల నిర్వచనంపై స్పష్టత లేనందునే న్యాయసలహా కోరామని తెలిపారు. ఈ వాదనను కోర్టు తోసిపుచ్చింది. "ఏఐని అడిగినా ఆ పదాలకు అర్థం చెబుతుంది. మీకే తెలియదా" అని ధర్మాసనం ఎద్దేవా చేసింది. "జైలుకు వెళ్తారా లేక ఆదేశాలు అమలు చేస్తారా"నని సీఎస్‌ను ధర్మాసనం నిలదీయగా గురువారం నాటికి ఉత్తర్వులు అమలు చేసి నివేదిక సమర్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ హరిహరనాథశర్మలతో కూడిన ధర్మాసనం ఈ హామీని నమోదు చేసుకొని విచారణను గురువారానికి వాయిదా వేసింది. ఆదేశాలు అమలు చేస్తే సీఎస్ వ్యక్తిగతంగా హాజరుకావాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది..

# నాడు ప్రేమించాడు - నేడు ముఖం చాటేసాడు..

## అక్కర్లేదని వదులుకున్నాడు..

## తల్లితండ్రులను కాదని పెళ్లి చేసుకున్న ఓ యువతికి ఆఖరికి చుక్కెదురు..



**అన్నమయ్య జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 26 - (రిపబ్లిక్ న్యూస్) -** నాకు ఉద్యోగం ఉంది. మాకు వ్యవసాయ భూములున్నాయి. నన్ను పెళ్లి చేసుకుంటే ఏ ఇబ్బందులు రానీయకుండా చూసుకుంటా. మా ఇంటి మహారాణిలా చూసుకుంటానని ఓ యువతికి మాయ మాటలు చెప్పి ఆ యువతిని నమ్మించాడు. అతడి మాయమాటలను నమ్మిన యువతి కన్నవాళ్లను సైతం కాదనుకుంది. అతనే సర్వస్వం అనుకొని నమ్మినవాడిని ప్రేమించి పెళ్లి చేసుకుంది. ఏడాదిన్నర కాలం కూడా గడవకనే ఆ యువతి చేదైంది. అంతే షురూ ఆ యువతిని వదిలించుకోవాలని ప్రేమించి పెళ్లి చేసుకున్న యువకుడు ముఖం చాటేస్తున్నాడు. దిక్కు తోచని ఆ యువతి న్యాయం కోసం బుధవారం పోలీసులను ఆశ్రయించింది. బాధిత యువతి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పెద్ద తిప్ప సముద్రం మండల కేంద్రమైన కందుకూరు పంచాయతీ నిలువురాతిపల్లికి చెందిన తెల్లగొర్ల గంగులప్ప కుమార్తె గాయత్రి (23) అనే యువతి డిగ్రీ వరకు చదివి బెంగళూరులోని ఓ కర్మాగారంలో పనికి కుదిరింది. అక్కడ ఆమె ఉద్యోగం చేస్తుండగా ఉద్యోగంలో చేరిన కొద్ది నెలలకు ఓ ఫంక్షన్ లో ఆమె బంధువుల ద్వారా బి. కొత్తకోట మండల కేంద్రమైన గట్టు గ్రామ పంచాయితీ దిన్నెమీదపల్లి గ్రామానికి చెందిన కటార్ క్రిష్ణప్ప కుమారుడు రాజశేఖర్ (25)తో పరిచయం ఏర్పడింది. అతను కూడా మదనపల్లెలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేసేవాడు. ఆ ఫంక్షన్ లో పరిచయమైన వీరిద్దరి పరిచయం కాస్త ప్రేమకు దారి తీసింది. కొద్దిరోజులు బాగానే ఎంజాయ్ చేశారు. అనంతరం ఆ యువతి ప్రస్తావన తీసుకొచ్చింది. ఇంట్లో చెప్తానని ఒప్పించి పెళ్లి చేసుకుందామని ఆ యువతిని నమ్మబలికాడు. ధైర్యం చేసుకొని తను ఇంట్లో వాళ్లకు చెప్పాడు. తను ఇంట్లో వాళ్లకు చెప్పింది. అయితే ఈ పెళ్లికి యువతి తల్లిదండ్రులు నిరాకరించారు. దీంతో ఆ యువతి కన్నవాళ్లను సైతం కాదని 2024 డిసెంబర్ 4న కాబోయే అత్తా, మామ సమక్షంలో రాజశేఖర్‌ను బెంగళూరులోని బన్నేరుగట్ట సమీపంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో పెళ్లి చేసుకుంది. అనంతరం బి.కొత్తకోట మండల కేంద్రమైన గట్టు గ్రామపంచాయతీ దిన్నెమీదపల్లి గ్రామం లో కాపురం పెట్టారు. కొన్నాళ్ల పాటు వీరి కాపురం సజావుగా సాగింది. అనంతరం ఆమె గర్భం దాల్చడంతో ఏడు నెలలకే నొప్పులు అధికమై ఓ మగబిడ్డకు జన్మనిచ్చింది. ప్రసవ సమయంలో ఆమె ఆరోగ్యం ఆందోళనకరంగా ఉండటంతో ఐసీయూలో చికిత్స పొందింది. కోలుకున్నాకా నా బిడ్డ ఎక్కడా అని భర్తను ప్రశ్నించగా చనిపోయాడని దిన్నెమీదపల్లిలోని వ్యవసాయ భూమిలో ఖననం చేసినట్లు చెప్పాడని ఆ యువతి వాపోయింది. కన్నబిడ్డ కడచూపు కూడా చూసుకోలేదని కంటతడి పెట్టింది. ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యాకా తాను అత్తారింట్లో రెండు రోజులు ఉండి భర్త, అత్తా, మామ కోరిక ప్రకారం గత ఏడాది డిసెంబర్ 15న పుట్టింటికి చేరానని, అప్పటి నుంచి తన భర్తలో చాలా మార్పు రావడంతో ఈ ఏడాది ఫిబ్రవరి 2న కన్నవాళ్లతో కలసి అత్తారింటికి వెళ్లగా లోనికి రావద్దని మొహాన్నే గేటు వేసారని యువతి వాపోయింది. ఎలాగైనా తనను వదిలించుకొని నా భర్తకు వేరే పెళ్లి చేసే ప్రయత్నాల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేసింది. దీంతో విసిగి వేసారిన ఆ యువతి న్యాయం కోసం పోలీస్ స్టేషన్ మెట్లెక్కింది. పోలీసులే న్యాయం చేయాలని వేడుకుంటుంది వేడుకొంటోంది. బుధవారం పెద్దతిప్ప సముద్రం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు యువతి పేర్కొంది.. విచారణ నిమిత్తం ఆ యువకుడుని కూడా స్టేషన్ కు పిలిపించినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సింది.

# జననేతకు జననీరాజనం..

- ఇసుకేస్తే రాలనంత జనం..
- కిక్కిరిసిన రహదారులు..
- జై జగన్ జై జై జగన్ తో నినాదాలు..
- జన సమూహంతో నెల్లూరు కిటకిట..
- వివాహ మహోత్సవానికి విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించిన ఏపీ మాజీ సీఎం - వైఎస్ జగన్



**ఏపీ బ్యూరో, ఫిబ్రవరి 26 - (రిపబ్లిక్ న్యూస్) -** మదనపల్లి :- వైయస్‌ఆర్‌సీపీ అధినేత వైఎస్ జగన్ నెల్లూరుకు బుధవారం విచ్చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ మాజీ ఛైర్మన్, వైయస్‌ఆర్‌సీపీ నేత కొండూరు అజయ్ రెడ్డి (రైల్వే కోడూరు) కుమారుడి వివాహ వేడుకల్లో పాల్గొనాలని వైయస్ జగన్ ను కొండూరు అజయ్ రెడ్డి ఆహ్వానించారు. ఆహ్వానాన్ని అందుకున్న వైఎస్ జగన్ వివాహానికి హాజరయ్యారు. ఈ క్రమంలో నెల్లూరు లోని వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన వివాహానికి భారీ భద్రత నడుమ హాజరయ్యారు. వివాహ మండపం వద్దకు విచ్చేసిన జగన్ ను కుటుంబ సభ్యులు అతిథి మర్యాదలతో స్వాగతం పలికారు. కొండూరు అజయ్ రెడ్డి కుటుంబ సభ్యులను ఆత్మీయంగా పలకరించి కొద్దిసేపు ముచ్చటించారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి వేదిక పైకి విచ్చేసి నూతన వధూవరులు సిద్దు సుష్మా, ప్రతుల్య రెడ్డిలను వైఎస్ జగన్ ఆశీర్వదించారు. వారిద్దరికీ వివాహ శుభాకాంక్షలు తెలిపారు. ఇక అంతకుముందు వైఎస్ జగన్ నెల్లూరుకు చేరుకున్న సందర్భంగా పార్టీ కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో హెలీప్యాడ్ వద్దకు చేరుకున్నారు. తమ అభిమాన నాయకుడు వైఎస్ జగన్‌కు ఘన స్వాగతం పలికారు. దీంతో భారీ జనసందోహానికి అభివాదం చేస్తూ వైఎస్ జగన్ ముందుకు సాగారు. ఆయనకు కరచాలమందించేందుకు పోటీ పడ్డారు. జై జగన్ జై జై జగన్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఆయన రాకను నిరీక్షించిన ప్రజలు ఆయన రాకతో పోడియం దద్దరిల్లించారు. ఈ వివాహ మహోత్సవ కార్యక్రమంలో లోక్ సభ ప్యానెల్ స్పీకర్, రాజంపేట ఎంపీ పెద్ద రెడ్డి వెంకట మిథున్ రెడ్డి, మరో ఎంపీ మేడా రఘునాథ్ రెడ్డి మరియు పలువురు వైసీపీ ప్రముఖులు హాజరయ్యారు..

# మైదానంలో ప్రజాప్రతినిధుల జోరు..

## క్రికెట్ ఆడి ఉత్సాహపరిచిన ఎమ్మెల్సీ బి.టి. నాయుడు

**విజయవాడ స్పోర్ట్స్ మీట్‌లో క్రీడాకారులకు ప్రోత్సాహం యువతకు ఉత్తేజం కలుగుతుందన్న వ్యాఖ్య**



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఫిబ్రవరి 26)** విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన స్పోర్ట్స్ మీట్ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది.

ఈ కార్యక్రమంలో సహచర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు ఎమ్మెల్సీ బి.టి. నాయుడు పాల్గొని క్రీడాకారులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన క్రికెట్ మ్యాచ్‌లో ఆయన సైతం పాల్గొని ఆటలో నైపుణ్యాన్ని ప్రదర్శించారు.ప్రజాప్రతినిధులు క్రీడల్లో పాల్గొనడం ద్వారా యువతకు ఉత్తేజం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం మరిన్ని కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు.

# శకునాల గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోబాలికల అవగాహన కార్యక్రమం




**ఓర్వకల్లు ప్రతినిధి, ఫిబ్రవరి 26, (ప్రజా రిపబ్లిక్ న్యూస్)** గురువారం రోజు ఓర్వకల్లు మండలం శకునాల గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు కౌమార దశలో బాలికల లో మార్పు , యుక్త వయస్సు లో జాగ్రత్తలు, ఆన్ లైన్ అపరిచిత వ్యక్తుల పరిచయాలు , నేరాలు, గురించి అవగాహన , గర్భాశయ క్యాన్సర్ వ్యాక్సిన్ గురించి అవగాహన కార్యాక్రమం నిర్వహించారు. కార్యక్రమం సచివాలయం ఏఎన్ఎమ్ , మహిళా పోలీస్ , ఆశవర్కర్లు వారు అందరూ మాట్లాడుతూ తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తుంటారు కాబట్టి వారిని మనసులో పెట్టుకొని బాగా చదువుకుని తల్లిదండ్రులకు స్కూలుకు మంచి పేరు తేవాల్సిందిగా చెప్పారు

# ఉలిందకొండ హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

## 8 ఏళ్ల బాలిక హత్య కేసులో తీర్పు - రూ.7 వేల జరిమానా విధింపు - మరో నిందితుడికి విముక్తి



**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఫిబ్రవరి 26)** ఉలిందకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన బాలిక హత్య కేసులో ప్రధాన నిందితుడు బోయ గిడ్డయ్య అలియాస్ సంతెన్నకు జీవిత ఖైదు శిక్ష విధిస్తూ కర్నూలు × అదనపు జిల్లా & సెషన్స్ న్యాయమూర్తి పి. కమల దేవి గురువారం తీర్పు వెలువరించారు. ఉలిందకొండ పి.ఎస్. క్రైమ్ నెం. 76/2016 ప్రకారం ఐపీసీ సెక్షన్లు 302, 201, 379 తీ/ష 109 కింద కేసు నమోదు చేయబడింది. ఉలిందకొండ గ్రామానికి చెందిన ముల్లా ముర్తుజావలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కల్లూరు మండలం గూడూరు గ్రామానికి చెందిన 8 సంవత్సరాల బాలిక హత్యకు గురైన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది. దర్యాప్తు పూర్తి చేసిన పోలీసులు నిందితులపై కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. విచారణ అనంతరం ప్రధాన నిందితుడు బోయ గిడ్డయ్య అలియాస్ సంతెన్న (60), ఎర్రకత్వ గ్రామం నివాసిని దోషిగా నిర్ధారించిన కోర్టు అతనికి జీవిత ఖైదుతో పాటు రూ. 7,000 జరిమానా విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా 2 నెలలు 15 రోజుల జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుంది. అదే కేసులో నిందితుడు బోయ తలారి రంగడు (35), గూడూరు గ్రామానికి చెందిన వ్యక్తిని సాక్ష్యాల లోపం కారణంగా కోర్టు విముక్తి కల్పించింది. ఈ కేసును సమర్థవంతంగా దర్యాప్తు చేసి నిందితుడికి శిక్ష పడేలా అప్పటి కర్నూలు రూరల్ సి.ఐ నాగరాజు యాదవ్ కృషి చేశారు. కేసు విజయంలో భాగమైన కర్నూలు రూరల్ సి.ఐ ఎం. చంద్రబాబు నాయుడు, ఉలిందకొండ ఎస్.ఐ ధనుంజయ, కోర్టు కానిస్టేబుళ్లను కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఐపీఎస్ అభినందించారు.

# తెలుగు గంగ ప్రధాన కాల్వకు మళ్లీ గండి

## 20 రోజుల వ్యవధిలో రెండోసారి



**బండి ఆత్మకూరు, ఫిబ్రవరి 26, (రిపబ్లిక్ న్యూస్):-** వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి మద్రాస్ కు వెళ్లే తెలుగు గంగ ప్రధాన కాలువకు మళ్ళీ గండి పడింది. బండి ఆత్మకూరు మండల పరిధిలోని నాలుగవ బ్లాకు సమీపంలో గురువారం తెల్లవారుజామున కాలువకు గండి పడి నీరు వృధాగా పోతుంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అయితే గత 20 రోజుల క్రితం ప్రస్తుతం గండి ఏర్పడిన కిలోమీటర్ దూరంలోనే ఇదే కాల్వకు గండి ఏర్పడడంతో అధికారులు వెంటనే అప్రమత్తమై యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టి మరమ్మత్తులు చేశారు. కాగా 20 రోజుల వ్యవధిలోనే మరోచోట కాల్వకు గండి పడటం పై రైతులు ఆందోళన చెందుతున్నారు. తెలుగు గంగ ప్రధాన కాలువ కింద వేలాది ఎకరాలకు సాగునీరు పారాల్సి ఉండటంతో రూ కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రధాన కాలువకు లైనింగ్ పనులు చేశారు. ఈ పనులు అసంపూర్తిగానే మిగిలినట్లు సమాచారం. కాగా ప్రధాన కాలువకు తరచూ ఏదో ఒకచోట గండి పడటం రైతులను ఆందోళన కలిగిస్తోంది. విషయం తెలుసుకున్న తెలుగు గంగ అధికారులు హుటాహుటిన గండి పడిన ప్రదేశానికి చేరుకొని పరిశీలించారు పరిస్థితి సమీక్షించి యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తులు చేపడుతామని తెలిపారు. రైతులు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని త్వరితగతిన గండిని పూడ్చి యధావిధిగా సాగునీటి విడుదల చేస్తామని తెలిపారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No.:2023/87888



## హంద్రీ-నీవా 195 చెరువులను నింపడమే ప్రభుత్వ లక్ష్యం : జిల్లా కలెక్టర్.......



**పుట్టపర్తి, ఫిబ్రవరి 26: (రిపబ్లిక్ న్యూస్)**
పుట్టపర్తి నియోజకవర్గ పరిధిలోని హంద్రీ-నీవా సుజల స్రవంతి హెచ్ ఎన్ ఎస్ ఎస్ కాలువ ద్వారా 195 చెరువులను నింపే ప్రక్రియను ప్రాధాన్యతగా తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ అధికారులతో కలిసి కాలువ పనులు మరియు పంప్ హౌస్‌లను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. హంద్రీ-నీవా కాలువ యొక్క 344.90 కిలోమీటర్ (జనకంపల్లి - పుట్టపర్తి రోడ్డు) వద్ద పనులను కలెక్టర్ తనిఖీ చేశారు. కాలువ వెడల్పు, నీటి సామర్థ్యం మరియు ప్రవాహ వేగంపై హెచ్ ఎన్ ఎస్ ఎస్ (స్ .ఇ .) రాజ్‌స్వరూప్ వివరణ ఇచ్చారు.కాలువలోని ఓటీ బి3 (343.250 కి.మీ) మరియు రెగ్యులేటర్ వద్ద పనులను పరిశీలించారు. ఈ ఓటీ బి3 ద్వారా సుమారు 143 చెరువులకు నీరు అందించే అవకాశం ఉన్నందున, ఆ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జనకంపల్లి వద్ద ఉన్న పంప్ హౌస్-3 మరియు యార్డ్ పనులను తనిఖీ చేశారు. అక్కడ ఉపయోగిస్తున్న పైపులు, వాటికి వేస్తున్న కోటింగ్ పెయింట్ యొక్క మందం (తిక్నెస్ ) మరియు ఇతర నాణ్యతా ప్రమాణాలను స్వయంగా పరిశీలించి, పనుల్లో ఎక్కడా రాజీ పడకూడదని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమము లో పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, ఎస్.ఈ. రాజ్‌స్వరూప్, ఈ.ఈ. గిరిధర్ రెడ్డి , ఏ.ఈ.ఈ.లు మరియు ఇతర శాఖాధికారులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్లు కు సంక్షేమ పథకాలు అమలు చేయాలి




**ఎమ్మిగనూరు, ఫిబ్రవరి, 26,(రిపబ్లిక్ న్యూస్ )**
ఏపీ అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ లకు కనీస వేతనం 26,000 ఇవ్వాలని గ్రాటివిటీ ఇవ్వాలని 30 రోజులు ఎండాకాలం సెలవులు ఇవ్వాలని అంగన్వాడీ వర్కర్లకు హెల్పర్లకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఈనెల 23 నుండి 26 వరకు ఎమ్మిగనూరు ప్రాజెక్టు పరిధిలో పాత ఎమ్మార్వో ఆఫీస్ ఆవరణలో బి నాగశిరోమణి అధ్యక్షతన జరిగిన దీక్షలో అర్బన్ కార్యదర్శి ఎస్ నాగలక్ష్మి సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బి రాముడు మాట్లాడుతూ ఏళ్ల తరబడి చాలీచాలని వేతనాలతో పనిచేయుచున్న అంగన్వాడి వర్కర్స్ హెల్పర్సులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు శ్రమదోపిడి చేస్తుందని విమర్శించారు ప్రధానమంత్రి ముఖ్యమంత్రి పేర్ల మీద పథకాలను అమలు చేస్తున్నారని మరియు గర్భవతులకు బాలింతలకు జీరో సిక్స్ పిల్లలకు సేవలు చేస్తున్న వర్కర్లు హెల్పర్లకు ప్రతిసారి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్లో అంగన్వాడీలకు వేతనాలు పెంచకపోవడం చాలా దుర్మార్గమని అన్నారు కూటమి ప్రభుత్వం టిడిపి జనసేన రాష్ట్ర నాయకులు ఎన్నికల ముందు అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్సుల 42 రోజులు సమ్మె సందర్భంగా సాక్షాత్తు సమ్మె శిబిరంలోకి వచ్చి మా ప్రభుత్వం వస్తే మీకు వేతనాలు పెంచుతాం జగన్మోహన్ రెడ్డి గా రూ మిమ్మల్ని మోసం చేస్తున్నారని అబద్ధాలు చెబుతున్నారని బహిరంగ సభలో సమ్మె శిబిరాల్లో మాజీ ముఖ్యమంత్రిని ఆనాడు విమర్శించారు నేడు కూటమి ప్రభుత్వం అధికారులకు వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్న ధరలు అనుకూలంగా మరియు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల ప్రకారం మా ప్రభుత్వ వస్తే వేతనాలు పెంచుతాం ఎండాకాలం సెలవులు ఇస్తాం సంక్షేమ పథకాలు అమలు చేస్తాం రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇస్తాం ఐదు లక్షల రూపాయలు గ్రాచిటీస్తాం తదితర హామీలన్నీ ప్రస్తుత ముఖ్యమంత్రి గౌరవనీయులు 2024 లో హామీలు ఇచ్చారని ఇచ్చిన హామీలను శాసన బడ్జెట్ సమావేశాల్లో వేతనాలు పెంచే ప్రక్రియ ప్రకటించాలని ఏపీ అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు నాయకురాలు బి నాగశిరమని మల్లేశ్వరి రామలింగమ్మ అరుణ రేణుక ప్రమీల లక్ష్మీదేవి మహేశ్వరి యు ఎమ్ నాగలక్ష్మి ధనలక్ష్మి బంధాలతో హైమావతి సుధారాణి నాగలక్ష్మి అంగన్వాడి వర్కర్స్ నాలుగవ రోజు దీక్షలో పాల్గొన్నారు సిఐటియు నాయకులు ఏ సురేష్ గారు పాల్గొన్నారు అంగనవాడి దీక్షలకు ఐ ఎఫ్ టి యు ఆలోక నాయకులు కే రాజు కే యం డి అలీఫ్ రవి మరియు డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి డి రవికుమార్ మద్దతు ఇచ్చారు ఫిబ్రవరి 27న వేతనాలు పెంపుకై కలెక్టర్ ఆఫీస్ ముట్టడిని జయప్రదం చేయాలని అంగన్వాడీ యూనియన్ నాయకులు సిఐటి నాయకులు పిలుపునిచ్చారు వేతనాలు పెంచకపోతే పోరాటాలు ఉధృతం చేస్తాం. ఏపీ అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు నాలుగవ రోజు దీక్షలు జయప్రదం జరిగినాయి 27న కలెక్టర్ ఆఫీస్ ముట్టడి కదలిరండి ఏపీ అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఎమ్మిగనూరు ప్రాజెక్టు పిలుపు

## నలుగురు పేకాటరాయుళ్లు అరెస్ట్

### రూ. 82,500 నగదు స్వాధీనం






**రిపబ్లిక్ క్రైమ్, ఫిబ్రవరి 26, తాడిపత్రి** తాడిపత్రి మండలం శివాలయం వెనుక పెన్నా నది పక్కన ఉన్న తోట ప్రాంతంలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి నుండి రూ. 82,500 నగదు, మోటార్ సైకిల్, 03 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం : గునిరెడ్డి సోమశేఖర్ రెడ్డి అలియాస్ రుస్తుమ్‌పసుల వరుణ్ కుమార్, బండి మైఖేల్,బొగ్గుల బాబు లను తాడిపత్రి సబ్-డివిజనల్ పోలీస్ అధికారి రోహిత్ కుమార్ చౌదరి ఐపీఎస్ గారి పర్యవేక్షణలో తాడిపత్రి రూరల్ యుపిఎస్ సిఐ ఎస్. శివగంగాధర్ రెడ్డి ఆధ్వర్యంలో పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి అరెస్టు చేసి రిమాండ్ కు తరలించనున్నట్లు తెలిపారు.ఈ దాడుల్లో ఎస్ఐ ధరణి బాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. అసాంఘిక కార్యక్రమాలను ఉపేక్షించేది లేదని ఎక్కడైనా జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ శివ గంగాధర్ రెడ్డి తెలిపారు.

## రోడ్డు ప్రమాదాలను నివారించాలి

### జిల్లా అదనపు కలెక్టర్ నగేష్



**మెదక్ జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 26( రిపబ్లిక్ న్యూస్ )**
గురువారం కలెక్టరేట్లోని మినీ సమావేశమందిరంలో రోడ్డు రవాణా అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలను నివారించి,ప్రజల్లో రోడ్డు రవాణా పై అవగాహన కల్పించాలన్నారు.
జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ మాట్లాడుతూ.. ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, బైక్ నడిపేవారు హెల్మెట్ పెట్టుకొని వాహనం నడుపాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## నీటి వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించాలి

**: కమిషనర్ పి. విశ్వనాథ్**

**లీకేజీలకు వెంటనే మరమ్మత్తులు ప్రతిరోజు తాగునీటి నాణ్యత తనిఖీకి ఆదేశాలు**





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఫిబ్రవరి 26)**
నగర ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు తాగునీటి వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి. విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన క్యాంపు కార్యాలయంలో ఇంజినీరింగ్ విభాగ అధికారులు, జూమ్ ద్వారా అమినిటీస్ కార్యదర్శులతో తాగునీటి సరఫరాపై సమీక్ష సమావేశం నిర్వహించారు.
తాగునీటి సరఫరాలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వకూడదని కమిషనర్ స్పష్టం చేశారు. అతిసారం వంటి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతిరోజు ఉదయం అన్ని సచివాలయాల పరిధిలో అమినిటీస్ కార్యదర్శులు, తాగునీటి సరఫరా సిబ్బంది కలిసి క్లోరిన్ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు.
ప్రతి 15 రోజులకు ఒకసారి నీటి ట్యాంకులను శుభ్రపరచాలని, ఆర్‌సి రిజిస్టర్‌ను తప్పనిసరిగా నిర్వహించాలని తెలిపారు. పైప్‌లైన్ లీకేజీలను గుర్తించి వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని సూచించారు. డ్రైనేజీ కాలువల్లో ఉన్న పైప్‌లైన్ల తొలగింపులో జాప్యం జరుగుతుండటంపై అసహనం వ్యక్తం చేశారు.గృహాల వద్ద కూడా డ్రైనేజీ కాలువల్లో పైప్‌లైన్ లేకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజల ఫిర్యాదులు, పత్రికల్లో వార్తలు వచ్చేంత వరకు వేచి ఉండకుండా సమస్యలను సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.
ఏఈలు, డిఈలు అమినిటీస్ కార్యదర్శులతో కలిసి ప్రతిరోజు ఉదయం క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించిన కమిషనర్, తాగునీటి కొళాయి చార్జీల వసూళ్లను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. నిధుల లభ్యతను బట్టి గుత్తేదారులకు బిల్లులు మంజూరు చేయాల్సి ఉంటుందని తెలిపారు.ఈ సమావేశంలో ఎస్‌ఈ రమణమూర్తి, ఎంఈలు మనోహర్ రెడ్డి, గిరిరాజ్, డిఈఈలు పవన్ కుమార్ రెడ్డి, నరేష్, క్రిష్ణలత, శ్రీనివాసన్, సూపరింటెండెంట్ మంజూర్ బాష, ఏఈలు జనార్ధన్, ప్రవీణ్ కుమార్ రెడ్డి, వైష్ణవి, ఖాసీం, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ‘ఆపరేషన్ వజ్రప్రహార్‘ విస్ఫోటకం ..

**చౌడేపల్లిలో రూ. 20.70 లక్షల విలువైన ‘కూల్-లిప్‘ స్వాధీనం**

**మత్తు పదార్థాల అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్న జిల్లా యంత్రాంగం..ఎస్పీ ధీరజ్ కునుబిల్లి**

**మదనపల్లిలో 150 మంది పోలీసులతో కార్డన్ అండ్ సెర్చ్; 24 వాహనాల సీజ్..**







**అన్నమయ్య జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 26 - (రిపబ్లిక్ న్యూస్) -**
మదనపల్లి :- రాష్ట్రవ్యాప్త డ్రగ్ నిర్మూలన స్పెషల్ డ్రైవ్ ‘ఆపరేషన్ వజ్రప్రహార్‘లో భాగంగా అన్నమయ్య జిల్లా పోలీసులు భారీ విజయాన్ని నమోదు చేశారు. గురువారం మదనపల్లి లోని డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ జిల్లాలో జరుగుతున్న ముమ్మర తనిఖీల వివరాలను వెల్లడించారు.

**చౌడేపల్లిలో భారీ రికవరీ..**
“ఆపరేషన్ వజ్రప్రహార్“లో భాగంగా చౌడేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన దాడులలో సుమారు రూ. 20,70,000/- (ఇరవై లక్షల డెబ్బై వేల రూపాయలు) విలువైన భారీ మొత్తంలో నిషేధిత ‘కూల్-లిప్‘ పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ మీడియాకు వెల్లడించారు. మత్తు పదార్థాల సరఫరా వెనుకున్న నెట్‌వర్క్‌ను ఛేదించడంలో ఇది కీలక ముందడుగని ఆయన పేర్కొన్నారు.

**మదనపల్లిలో నాకాబందీ..**
అన్నమయ్య జిల్లా కేంద్రమైన మదనపల్లి పట్టణం లోని నీరుగట్టువారిపల్లి, కాట్లాటపల్లి రోడ్డు మరియు రామిరెడ్డి లే అవుట్ ప్రాంతాల్లో అదనపు ఎస్పీ వెంకటాద్రి పర్యవేక్షణలో 150 మంది పోలీసు సిబ్బందితో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో డాగ్ స్క్వాడ్ సాయంతో ప్రతి ఇంటిని, అనుమానిత ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేశామని తెలిపారు.


**నిబంధనల ఉల్లంఘునపై చర్యలు..**
రికార్డులు సరిగా లేని 24 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని రౌడీ షీటర్లు, సస్పెక్ట్‌లను పిలిపించి వారి ప్రవర్తనపై గట్టి హెచ్చరికలు జారీ చేశామని చిన్న దుకాణాల్లో మత్తు పదార్థాలు విక్రయిస్తున్న వారిని గుర్తించి కౌన్సిలింగ్ ఇచ్చామని ఇలానే పునరావృతమైతే కఠిన కేసులు నమోదు చేస్తామని జిల్లా ఎస్పీ వెల్లడించారు.

**ఎస్పీ గారి హెచ్చరిక..**
“గంజాయి, సింథటిక్ డ్రగ్స్ లేదా నిషేధిత పొగాకు ఉత్పత్తుల సరఫరాలో ఎంతటి వారు ఉన్నా వదిలే ప్రసక్తే లేదు. ముఖ్యంగా విద్యాసంస్థల సమీపంలో నిషా పెంచామని యువత భవిష్యత్తుతో ఆడుకునే వారిపై పీడీ యాక్ట్ ప్రయోగించడానికి కూడా సిద్ధంగా ఉన్నామని ఎస్పీ హెచ్చరించారు.

**ప్రజలకు విజ్ఞప్తి..**
జిల్లాలో మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమాచారమిచ్చిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచబడతాయని ఎస్పీ భరోసా ఇచ్చారు.
ఈ భారీ ఆపరేషన్లలో ప్రతిభ కనబరిచిన చౌడేపల్లి మరియు మదనపల్లి పోలీసు సిబ్బందిని, ఈగల్ టీం సీఐ వారి సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు..

## రైతులను ఆదుకొనే ప్రభుత్వం తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం

**డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ వై. నాగేశ్వరరావు యాదవ్ వ్యాఖ్యలు**







**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఫిబ్రవరి 26)**
కర్నూలు నగరంలోని ఫార్చునర్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ మరియు జిల్లా సహకార కోపరేటివ్ బ్యాంకుల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ వై. నాగేశ్వరరావు యాదవ్, డీసీసీబీ సీఈఓ రామాంజనేయులు, డీసీఓ వెంకట కృష్ణ, డీసీఎంఎస్ మేనేజర్ రాజేష్, ఉమ్మడి జిల్లా పీఏసీ చైర్మన్లు మరియు అధికారులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా విష్ణువర్ధన్ రెడ్డి మరియు నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సహకారం వల్ల వ్యవసాయ రంగం బలోపేతం అవుతోందన్నారు. రైతులకు అందించే రుణాలు, వాటి వసూళ్లు, అలాగే రైతులు పండించిన పంటలను ఒకేచోట సేకరించి గిట్టుబాటు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేసే విధానంపై సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. అదేవిధంగా సహకార సంఘాల ఆస్తులను పరిరక్షించడం, వాటి ఆదాయాలను పెంపొందించడం, సంఘాలలో పలు సంస్కరణలు అమలు చేయడం వంటి అంశాలపై కూడా సమీక్షించినట్లు పేర్కొన్నారు. సహకార రంగంలో సంస్కరణలు తీసుకొచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు వ్యవసాయ శాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు

## కర్నూలులో హత్య కేసు ఛేదించిన పోలీసులు

### నలుగురు ముద్దాయిల అరెస్టు కత్తులు, ఆటో స్వాధీనం



**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఫిబ్రవరి 26)**
కర్నూలు పట్టణంలో సంచలనం రేపిన హత్య కేసును పోలీసులు ఛేదించి నలుగురు ముద్దాయిలను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ జె.బాబు ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు కర్నూలు వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్.నెం.10/2026 కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు చెప్పారు.పోలీసుల కథనం ప్రకారం, ఈ నెల 22వ తేదీ రాత్రి పాత బస్ స్టాండ్ సమీపంలోని అనిల్ బార్ వద్ద మద్యం విషయంలో పిర్యాది బాబాయి విజయ్ మరియు ముద్దాయిల మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం వివాదం ముదిరి ఖండేరి ఐటీఐ కాలేజీ సమీపంలో ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది.ఈ గొడవ విషయం తెలుసుకుని అక్కడికి వచ్చిన అమరచింతల మనోహర్‌ను ముద్దాయిలు కత్తులు, కర్రలతో దాడి చేశారు. ఎడమ మెడ భాగంలో కత్తితో పొడవడంతో మనోహర్ అక్కడికక్కడే కుప్పకూలాడు. బంధువులు అతన్ని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి (జీజీహెచ్)కు తరలించగా వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనలో పిర్యాదిదారుడు మారుతికి కూడా గాయాలయ్యాయి.కేసు దర్యాప్తులో భాగంగా ఫిబ్రవరి 25 సాయంత్రం డీఎస్పీ జె.బాబు ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం జోహారపురం కరెంట్ సబ్ స్టేషన్ సమీపంలో నిందితులను అరెస్ట్ చేసింది. వారి వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన ఒక ఆటో, రక్తపు మరకలు ఉన్న రెండు కత్తులు, నకులు (పంచ్) స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైన నిందితులను కోర్టులో హాజరు పరచినట్లు పోలీసులు తెలిపారు.

# పానుగంటి అక్రమ అరెస్ట్ ని ఖండించిన విద్యార్థి నాయకులు

**కేసులకు అదరం,బెదరం -ఉద్యమాల ఉధృతమే మా లక్ష్యం**

**పానుగంటి చైతన్య మీద కేసులు అక్రమం -అంబేద్కర్ విగ్రహం వద్ద మోకాళ్ళ మీద నిరసన**

**నారా లోకేష్ విద్యార్థులకు నిధులు విడుదల చేయాలి -రెడ్ బుక్ రాజ్యాంగంలో విద్యార్థి నాయకులపై అక్రమ కేసులు**





**అనంతపురం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 26,(రిపబ్లిక్ న్యూస్):**
పానుగంటి అక్రమ అరెస్ట్ ని వైఎస్ఆర్సిపి విద్యార్థి విభాగం అనంతపురం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్ ఖండించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం అక్రమంగా వైయస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు పానుగంటి చైతన్యని అరెస్ట్ చేయడాన్ని నిరసనగా వైఎస్సార్ విద్యార్థి విభాగం అనంతపురం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ప్ల కార్డులు పట్టుకొని నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎద్దుల నవీన్ రెడ్డి పాల్గొన్నారు.

**చైతన్య అరెస్ట్ .. రెడ్ బుక్ రాజ్యాంగంలో భాగమే**

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకి హామీలు నేరవేర్చక విద్యార్థి నాయకులపై కక్ష సాధిస్తుందని ఆయన మండిపడ్డారు. అందులో భాగంగా దేశద్రోహులను చూసినట్టు విద్యార్థి నాయకులను జైల్లో పెట్టడం ఏమిటని, రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని, మంత్రి నారా లోకేష్ విద్యార్థులకు ఇవ్వవలసినటువంటి బకాయిలు చెల్లించాలి గాని చెల్లించామని అడిగిన విద్యార్థి నాయకుల పైన కేసులు పెట్టడం సరికాదంటూ కూటమి ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. కూటమి పెడుతున్న కేసులకి విద్యార్థి నాయకులు అదిరేది లేదు బెదిరేది లేదంటూ.. విద్యార్థుల పక్షాన వైయస్సార్ విద్యార్థి విభాగం ప్రజా గొంతుకై వినిపిస్తూనే ఉంటుందని పానుగంటి చైతన్య అక్రమ అరెస్ట్ రెడ్ బుక్ రాజ్యాంగంలో భాగమేనని,కూటమి ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు.ప్రశ్నించే పవన్ కళ్యాణ్ మౌనం వీడి విద్యార్థుల పక్షాన నిలవాలని హితవు పలికారు.

కార్యక్రమంలో వైఎస్ఆర్ విద్యార్థి విభాగం పులి కార్తికేయ, హరీష్,చరణ్,కృష్ణ, లోకేష్,కార్తీక్, బాబా ఇమ్రాన్, కార్తీక్, నంద,విజయ్,మహేష్,సంతోష్ రెడ్డి, బబ్లు,సాయి, వడ్డే ప్రవీణ్, శివ, సాయి, నాగేంద్ర, రాజా, సుధీర్, అనిల్, బాబా ఇమ్రాన్, సూర్య తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు లేకుంటే వ్యవసాయరంగం లేదు మహిళలు ఎంతో శక్తివంతులు

**ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మరియు మహిళా సమైక్య ఆధ్వర్యంలో కర్నూలు నగరంలో పత్రికా సమావేశం**

**కర్నూలు ప్రతినిధి ఫిబ్రవరి 26, (ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే జగన్నాథం మరియు ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి పి శ్రావణి రెడ్డి గురువారం రోజు

మాట్లాడుతూ మహిళా రైతులను ప్రభుత్వ ప్రోత్సహించడం లేదని అన్నారు వ్యవసాయ రంగంలో ఎక్కువ పాత్ర మహిళలది ఉన్నది పురుషుల కన్నా ఎక్కువ గంటలు శ్రమ చేస్తున్నారు, ప్రతిరోజు పంట పొలాల్లో పనిచేసే వారు మహిళలే ఇలాంటి మహిళలను ప్రోత్సహిస్తే వ్యవసాయంలో మరింత దిగుబడి సాధించవచ్చు నాణ్యమైన విత్తనాలు పురుగు నివారణ చర్యలు వాడకం మార్కెటింగ్ ఏ పంట వేస్తే ఎంత దిగుబడి వస్తుందనేటువంటి అవగాహన తదితర విషయాలన్నీ మహిళా రైతులకు తెలియజేయాలి అంటే మహిళా రైతులకు మండల స్థాయిలో వ్యవసాయ అధికారులు శిక్షణ ఇచ్చి వారిని వ్యవసాయంలో అధిక దిగుబడి సాధించే మహిళలుగా తీర్చిదిద్దాలలని ఈ బాధ్యత ప్రభుత్వానిదే మహిళా రైతులకు వ్యవసాయంలో ఉన్నటువంటి అన్ని రకాల అప్పులను మాఫీ చేయాలఅని పురుషుల కన్నా మహిళలకే వ్యవసాయ మీద ఆసక్తి అంతేగాక మేకలు, గొర్రెలు, కోళ్ళు తదితర పెంపకంలో కూడా మహిళల పాత్ర చాలా ఉన్నది కావున పశు సంవర్ధక శాఖ కూడా ఆలోచన చేసి గొర్రెల పెంపకము




కోళ్ల పరిశ్రమ మేకలు ఎడ్ల బళ్ళు (ఎద్దుల బండ్లు) నాణ్యమైన విత్తనాలు అధిక దిగుబడి సాధించడానికి తీసుకోవాల్సినజాగ్రత్తలు తదితర విషయాల పైన మహిళా రైతులకు తగిన ప్రోత్సాహకాలు ఇవ్వాలఅని ప్రస్తుత కాలంలో మన దేశంలో పురుషుల కన్నా మహిళలే పంట పొలాల్లో ఎక్కువగా కలుపులు కోతలు నూర్పిడి తదితర అన్ని విషయాల్లో కూడా పురుషులకు చేదోడుగా వాదోడుగా ఉండేది మహిళలే ఈ సందర్భంగా మహిళలు 10 మంది ఉంటే పురుషులు ఒకరు ఇద్దరు మాత్రమేపనిచేస్తున్నారని కావున మహిళలు లేకుండా వ్యవసాయ రంగం లేదుమహిళలుతమ కుటుంబాన్ని చూసుకుంటూ పంట పొలాలు కూడా కాపాడుతున్నారు, మన దేశంలోఏమాత్రం వ్యవసాయంలో దిగుబడి వస్తున్నదంటే దానికి మహిళలు అని చెప్పుకోవాలని ఇలాంటి పరిస్థితుల్లో మహిళలనుచిన్నచూపుచూడకుండా వారికి పండ్ల తోటల పెంపకము పూల తోటలు పెంపకము హార్టికల్చర్ పట్టుపురుగుల పెంపకం తదితరి విషయాల్లో కూడా తగిన అవగాహన కల్పించి శిక్షణ ఇవ్వాల ని ఇవన్నీ కూడా ప్రభుత్వము ప్రత్యేక చర్య తీసుకొని మహిళా రైతులకు తగిన శిక్షణను ఇచ్చే విధంగా చూడాలని ఈ శిక్షణను కూడా జిల్లా స్థాయిలో కాకుండా ప్రతి మండలములో ప్రతి సంవత్సరము దశలవారీగా గ్రామాల వారీగా శిక్షణ ఇస్తే మరింత దిగుబడి తీయడానికి అవకాశం ఉన్నది కావున ఈ విషయాన్ని గుర్తించి తక్షణమే ప్రభుత్వము తగిన చొరవ చూపాలని అన్నారు ఈ సంవత్సరము కర్నూలు జిల్లాలో మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళ రైతుల దినోత్సవం కూడా పాటించి జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఈ మహిళా రైతుల దినోత్సవాన్ని జరుపుకోవాలని వ్యవసాయంలో రాటు తేలిన అధిక దిగుబడి తెస్తున్న రైతుల ను సన్మానించాలని ఈ సందర్భంగా వారు అన్నారు ఈ పత్రిక విలేకరు సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి దంభోళం శ్రీనివాసరావు మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు వా.గిడ్డమ్మ నగర కార్యదర్శి భారతి కల్లూరు మండల రైతు సంఘం కార్యదర్శి బి రాముడు అధ్యక్షులు కృష్ణ నాయకుతరులు పాల్గొన్నారు

# హంద్రీనీవా-పీఏబిఆర్ కాలువల్ని అనుసంధానం చేయండి

**అసెంబ్లీలో ఎమ్మెల్యే పరిటాల సునీత విజ్ఞప్తి**

**సాగునీటి సమస్యలపై మరోసారి వాణి వినిపించిన పరిటాల సునీత**

**హంద్రీనీవా ద్వారా పలు చెరువులకు నీరందించాలని విజ్ఞప్తి**

**అమరావతి ప్రతినిధి, ఫిబ్రవరి 26,(రిపబ్లిక్ న్యూస్):**
హంద్రీనీవా-పీఏబిఆర్ కాల్వలను అనుసంధానం చేసి నిర్దేశిత చెరువులకు సాగునీరు అందించాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అసెంబ్లీ వేదికగా విజ్ఞప్తి చేశారు. గురువారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో మరోసారి రాప్తాడు నియోజకవర్గంలో సాగునీటి సమస్యలపై తన వాణి వినిపించారు. జీరో అవర్ లో ఆమె మాట్లాడుతూ పిఏబిఆర్ కుడి కాలువ ద్వారా రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల్లోని చెరువులకు ప్రతి ఏటా నీరు విడుదల చేస్తున్నా.. ఎప్పుడూ కనీసం 30శాతం కూడా ఇవ్వలేదన్నారు. దీని వలన రైతులకు నిరాశ మిగులుతోందని పంటలు నష్టపోతున్నారన్నారు. అందుకే ఆత్మకూరు మండలంలోని హంద్రీ-నీవా ప్రధాన కాలువ నుంచి అదే మండలంలోని పీఏబీఆర్ కుడి కాలువకు లింక్ కెనాల్ ఏర్పాటు చేస్తే రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాలలోని సుమారు 50చెరువులకు సాగు నీరు ఇవ్వడానికి అవకాశం ఉంటుందన్నారు. అలాగే హంద్రీనీవా ప్రధాన కాలువ నుంచి ఆత్మకూరు మండలం వేపచెర్ల సమీపంలోని గోపాలప్ప కుంటకు నీరందిస్తే ఐదు వందల ఎకరాల్లోని వంద బోరుబావులకు ఉపయోగం చేకూరుతుందన్నారు. బండమీదపల్లి చెరువుకు వస్తున్న పిల్ల కాలువ నుంచి 2కిలోమీటర్లు కొత్తగా కాలువ ఏర్పాటు చేస్తే.. పాలబావి, చెర్లోపల్లి, చాపట్ల, మరూరు, ముక్తాపురం చెరువులకు నీరు అందించవచ్చన్నారు.



కాలువ నిర్మాణానికి 6కోట్లతో అంచనాలు తయారు చెన్నేకొత్తపల్లి మండలం వెంకటంపల్లి సమీపంలోని హంద్రీనీవా ప్రధాన కాలువ నుంచి పిల్ల కాలువ ద్వారా కనుముక్కల ఎర్ర చెరువు, మేడాపురం చెరువుకు నీరు ఇస్తే వెంకటంపల్లి, ఓబులంపల్లి, ఒంటికొండ, చిన్న మొగలయిపల్లి, పెద్ద మొగలయిపల్లి, మేడాపురం, కనుముక్కల, వెల్దుర్తి గ్రామాల రైతులకు ఉపయోగం చేకూరనుందన్నారు. ఈ కాలువ నిర్మాణానికి 6కోట్ల 30లక్షలతో అంచనాలు కూడా తయారు చేశారని.. వీటికి నిధులు అందించాలని కోరారు. మరోవైపు పేరూరు ప్రాజెక్టు పనులు పునఃప్రారంభంతో పాటు రైతులకివ్వాల్సిన పరిహారం మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఇదే ప్రాజెక్టు 2018లో ప్రారంభించగా.. జగన్ రెడ్డి వచ్చాక అన్ని పనులు ఆగిపోయాయని ఎమ్మెల్యే పరిటాల సునీత విమర్శలు చేశారు.

# అవుకు మార్కెట్ వీధిలో డ్రైనేజీ సమస్య తీవ్రం

**స్పందించకపోతే నంద్యాల జిల్లా కలెక్టర్‌ను కలుస్తామంటూ కాలనీవాసుల హెచ్చరిక**



**అవుకు ఫిబ్రవరి 26 రిపబ్లిక్ (న్యూస్)**
అవుకు మార్కెట్ వీధిలో డ్రైనేజీ కాలువ సమస్య తీవ్రంగా మారిందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు పలుమార్లు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి స్పందన లేకపోవడంతో ప్రజలు నిరాశ చెందుతున్నారు
డ్రైనేజీ కాలువలో పేరుకుపోయిన చెత్త కారణంగా తీవ్ర దుర్వాసన వస్తోందని పందులు మరియు కుక్కలు అక్కడ తిరుగుతూ పరిస్థితిని మరింత దారుణంగా మారుస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. కాలువ పక్కన నివసించే ఇంటి యజమానులు, అంగడి వ్యాపారులు ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు సరైన శుభ్రత లేకపోవడంతో వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని వారు హెచ్చరిస్తున్నారు
ఈ సమస్యపై అధికారులు స్పందించకపోతే నంద్యాల జిల్లా కలెక్టర్ గారిని కలిసి ఫిర్యాదు చేయాలని కాలనీవాసులు నిర్ణయించుకున్నారు తక్షణమే డ్రైనేజీ కాలువలను శుభ్రపరచి శాశ్వత పరిష్కారం చూపించాలని వారు డిమాండ్ చేస్తున్నారు

# తప్పిపోయిన వ్యక్తి మృతదేహం లభ్యం

**అనంతపురం క్రైమ్, ఫిబ్రవరి 26,(రిపబ్లిక్ న్యూస్):**
వారం రోజుల క్రితం తప్పిపోయిన మారుతి సప్లయర్స్ అధినేత తుమ్మల రామాంజనేయులు ఆచూకీ ఎట్టకేలకు లభ్యమయింది. అందరూ ఊహించినట్లుగానే హెచ్ ఎల్ సి లో పడి ఆత్మహత్య చేసుకున్నట్లు నిగ్గు తేలింది. కుటుంబ కలహాల కారణంగా గత శనివారం తహసిల్దార్ కార్యాలయం సమీపంలో హెచ్ ఎల్ సి కెనాల్ గట్టుపై దుస్తులు వదిలేసి నీటిలో దూకాడు. నీరు ఎక్కువ లోతు లేకపోయినా అతను ఆత్మహత్య చేసుకోవాలనే తలంపుతోనే బలవర్మరణం పొందాడు. కూతుర్ల పెళ్లి విషయంలో అభిప్రాయ భేదాలు రావడంతో ఆయన ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు , బంధుమిత్రులు తెలిపారు. హెచ్ ఎల్ సి లో పోలీసులు, బంధుమిత్రులు ఎంత గాలించినా భౌతిక కాయం లభించలేదు. అసలు నీటిలో దూకాడ లేదా అన్న అనుమానాలు తలెత్తాయి.గురువారం బుక్కరాయసముద్రం మండలం కొట్టాలపల్లి కెనాల్ కాలువలో ఆయన మృతదేహం లభ్యమైంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



మృతిచెందిన మారుతి సప్లయర్స్ అధినేత తుమ్మల రామాంజనేయులు (ఫైల్ ఫోటో).

# మడకశిరలో ఆర్‌డీటీ ఎఫ్‌సీఆర్‌ఏ రీన్యువల్ డిమాండ్

**ప్రజా సంఘాల ర్యాలీ ఆర్‌డీటీకి మద్దతు - ఎఫ్‌సీఆర్‌ఏ రీన్యువల్ కోసం మడకశిరలో నిరసన**

**నిరుపేదలకు సేవ చేస్తున్న ఆర్‌డీటీకి ప్రజా సంఘాల అండ**

**మడకశిర, ఫిబ్రవరి 26 (రిపబ్లిక్ న్యూస్)**
మడకశిర మండల కేంద్రంలో గురువారం వివిధ ప్రజా సంఘాలు ఐక్యవేదిక ఏర్పరచి ఆర్‌డీటీకి సంబంధించిన ఎఫ్‌సీఆర్‌ఏను వెంటనే రీన్యువల్ చేయాలని డిమాండ్ చేస్తూ ర్యాలీ నిర్వహించాయి. మడకశిర పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం నుండి తాసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి, అక్కడ నిరసన కార్యక్రమం చేపట్టి వినతిపత్రం సమర్పించారు.నిరుపేదలకు సేవ చేస్తున్న ఆర్‌డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రీన్యువల్ ఇవ్వకపోతే ప్రజా సంఘాల ఉద్యమం ఆగదని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు, హైకోర్టు అడ్వకేట్ శివరామకృష్ణ, దళిత హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.ఆర్. హనుమంతు, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు టి.అంజినప్ప, రాయలసీమ జిల్లా అధ్యక్షులు అక్కలప్ప, హిందూపురం పార్లమెంట్ అధ్యక్షులు యూ.ఎన్. శంకరప్ప, మడకశిర తాలూకా అధ్యక్షులు బి.ఎన్.రామాంజనేయులు, ఉపాధ్యక్షులు ఎన్.అంజి, మండల అధ్యక్షులు డి.చందు, కెవిపిఎస్ రవి మెలవాయి, ఆర్‌డీటీ అభిమానులు పాల్గొన్నారు.




# హిందూపురం పట్టణంలో డ్రోన్ నిఘా

**- పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు**





**హిందూపురం, ఫిబ్రవరి 26: (రిపబ్లిక్ న్యూస్)** జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు హిందూపురం పట్టణంలోని పలు కాలనీలపై పోలీసులు డ్రోన్ల ద్వారా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. పట్టణ భద్రతను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ గురువారం సిబ్బందితో కలిసి డ్రోన్ పర్యవేక్షణ చేపట్టారు. డ్రోన్ల సహాయంతో ఆయా ప్రాంతాల భౌగోళిక పరిస్థితులు, అనుమానాస్పద వ్యక్తుల సంచారం, అక్రమ కార్యకలాపాలు, ప్రజా భద్రతకు విఘాతం కలిగించే పరిస్థితులను రికార్డు చేశారు. ముఖ్యంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై ప్రత్యేక నిఘా పెట్టారు. డీఎస్పీ కెవి మహేష్, సీఐలు, పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు: పట్టణంలో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.అధికారులు తెలిపారు, ఇటువంటి డ్రోన్ పర్యవేక్షణలు తరచుగా నిర్వహించడం ద్వారా నేర కార్యకలాపాలను అరికట్టడంలో పెద్దగా ఉపయోగపడుతుందని .

# సోషల్ మీడియా ఇబ్బందికర పోస్టులపై చర్యలు

**వాట్సాప్ గ్రూప్ అడ్మిన్లపై కూడా కేసులు - తల్లిదండ్రులు పిల్లలపై నిఘా ఉంచాలని సూచన**

**ఫిర్యాదుల కోసం డీఎస్పీ, సిఐ ఫోన్ నంబర్లు అందుబాటులో**

**హిందూపురం, ఫిబ్రవరి 26: (రిపబ్లిక్ న్యూస్)** హిందూపురంలో 30 పోలీస్ యాక్ట్ అమల్లోకి తీసుకువచ్చినట్లు డీఎస్పీ కె.వి. మహేష్ గురువారం వెల్లడించారు. ప్రజా శాంతి భద్రత కోసం ఈ చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. డీఎస్పీ మహేష్ మాట్లాడుతూ ఎక్కడా గుంపులుగా ఉండకూడదని, అనుమతులు లేకుండా ర్యాలీలు, ధర్నాలు నిర్వహించరాదని హెచ్చరించారుసోషల్ మీడియాలో ఇబ్బందికరమైన పోస్టులు పెట్టడం, షేర్ చేయడం చట్టవిరుద్ధమని, వాట్సాప్ గ్రూపుల్లో ఇలాంటి పోస్టులు వస్తే గ్రూప్ అడ్మిన్లపై కూడా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలు నిజా నిజాలు తెలుసుకోకుండా ఒకరిని కించపరిచే విధంగా పోస్టులు పెట్టరాదని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే ప్రతి పోస్టుపై పోలీసుల నిఘా ఉంటుందని, అనవసరమైన పోస్టులు పెట్టి జీవితాలను నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై నిఘా ఉంచి వారిని తరచూ హెచ్చరించాలని ఆయన సూచించారు. ఫిర్యాదులు చేయదలచిన వారు హిందూపురం డీఎస్పీ మహేష్ (9281107076) లేదా వన్టౌన్ సిఐ (9440796844) ను సంప్రదించవచ్చని తెలిపారు.

# గుడిబండ మండల రైతులకు ముఖ్య సమాచారం

**గుడిబండ, ఫిబ్రవరి 26 (రిపబ్లిక్ న్యూస్)**
రైతులు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ వంటి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందాలంటే రైతు నమోదు తప్పనిసరి. గుడిబండ వ్యవసాయ అధికారి వీర నరేష్ తెలిపారు. ప్రభుత్వం అందించే అన్ని పథకాలకూ అర్హత సాధించాలంటే ప్రతి రైతు తప్పనిసరిగా పదకొండు అంకెల ఏపీ ఎఫ్ ఆర్ నమోదు సంఖ్యను పొందవలసి ఉంటుంది. ఈ సంఖ్య లేకుండా రైతులు పథకాల లబ్ధి పొందలేరు.గుడిబండ మండలంలో ఇంకా వెయ్యి ఏడువందల మంది రైతులు ఏపీ ఎఫ్ ఆర్ నమోదు సంఖ్యను పొందలేదు. ఈ నెల ఇరవై ఎనిమిది తేదీ, రెండు వేల ఇరవై ఆరు చివరి తేదీగా నిర్ణయించబడింది. ఇంకా రెండు రోజులు మాత్రమే గడువు ఉంది.అందువల్ల రైతులందరూ వెంటనే రైతు సేవా కేంద్రం అధికారిని సంప్రదించి ఏపీ ఎఫ్ ఆర్ లో నమోదు చేసుకోవాలి. నమోదు చేసుకున్న రైతులు మాత్రమే ప్రభుత్వం అందించే పథకాలన్నింటికీ అర్హులు అవుతారు. వ్యవసాయ అధికారి వీర నరేష్ రైతులను కోరుతూ, "ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం, సబ్సిడీలు, పథకాల లబ్ధి పొందాలంటే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఆలస్యం చేయకుండా వెంటనే నమోదు చేసుకోండి" అని తెలిపారు.



# వెంటనే రోడ్లు డ్రైనేజీలు వెయ్యండి

## -ప్రగతిశీల యువజన సంఘం ,పివై ఎల్ జిల్లా కార్యదర్శి కే చిన్ని ప్రసాద్ -మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి కి వినతిపత్రం



**ఎమ్మిగనూరు, ఫిబ్రవరి, 26,(రిపబ్లిక్ న్యూస్ ):** ఎమ్మిగనూరు పట్టణం నందుగోనెగండ్ల రోడ్డు ,డ్రైనేజీలను మరమ్మతులు చేయాలని డిమాండ్ చేస్తున్నాం ఈ కార్యక్రమాన్నిఉద్దేశించి కామ్రేడ్ చిన్ని ప్రసాద్ మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం 10సంవత్సరాలు అయినా పట్టించుకోలేదు. ప్రస్తుతం ఉన్న ఈ ప్రభుత్వం కూడారోడ్డు ,డ్రైనేజీలను మరమ్మతులు చేయించలేదు రోడ్డుకు, డ్రైనేజీలకుదిక్కు లేదు ప్రతిరోజు వేల మంది తిరుగుతుంటారు అలాగే వృద్ధులు మహిళలు వికలాంగులు మరియు స్కూలుకు వెళ్లే విద్యార్థులకు కూడా తిరుగుతా ఉంటారు ఇప్పటికైనా గోనెగండ్లరోడ్డు, డ్రైనేజీల ను వేయాలని ఇదేవిధంగా రోడ్డు డ్రైనేజీలు ఉంటేషాపుల్లోకి దుమ్ము ధూళి వెళు తుందని ప్రజలు అనారోగ్యానికి గురి అవుతామని ఇక్కడ ఉన్న అంగళ్ల వాళ్లు ప్రాధేయ పడుతున్నారు ఇప్పటికైనా ఈనెల కౌన్సిల్ సమావేశంలో కూటమి ప్రభుత్వం మున్సిపల్ అధికారులు స్పందించి వెంటనే ఈ రోడ్డును మరమ్మతులు చేపట్టాలని కోరుతు ఉన్నాం. ఈ దారిలోవందలు టూ వీలర్స్ ఆటోలు జీపులు లారీలు ఐచర్లు వాహనాలతో వెళుతూ ఉంటాయి.కూటమి ప్రభుత్వం అధికారం వచ్చి రెండు సంవత్సరాలు అయిన కూడా రోడ్డు డ్రైనేజీలపై స్పందించలేదని ఇప్పటికైనా స్పందించి వెంటనే రోడ్డు డ్రైనేజీలను వేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ అధికారులు మరియు కమిషనర్ ప్రతిరోజు అదే రోడ్డులో తిరుగుతున్న రోడ్డు పరిస్థితి కనిపించడం లేదని నాయకులు ప్రశ్నించారు. ఏ వన్ గ్రేడ్ మున్సిపాలిటీ అని చెప్పుకుంటారు కదా పన్నులు విధించడం మాత్రమే కాదు మున్సిపల్ కమిషనర్ రోడ్ల డ్రైనేజులను పరిస్థితి ఒకసారి చెక్ చేసుకోవాలని లేనియెడల మున్సిపల్ కార్యాలయమును పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని నాయకులు తీవ్ర వ్యాఖ్యలు చేశారు ఈ కార్యక్రమంలో. ఐ ఎఫ్ టి యు తాలుక నాయకులు లక్ష్మణ, షాప్స్ ఓనర్స్, నజీర్ అహ్మద్, రాఘవేంద్ర మునియప్ప, ఫాహిద్ మరియు ఈ ప్రాంతపు అంగళ్ళ ఓనర్స్ పాల్గొన్నారు

# కడివెల్ల చర్చి నిర్మాణంకు లక్ష విరాళం




**ఎమ్మిగనూరు, ఫిబ్రవరి, 26,(రిపబ్లిక్ న్యూస్ ):** ఎమ్మిగనూరు నియోజకవర్గం మండల పరిధిలోని కడివెల్ల గ్రామంలోని ఏబియం చర్చి శిఖరం నిర్మాణం కొరకు వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు కె ఆర్ మురహరి రెడ్డి రూ. లక్ష (1,00,000) రూపాయలు విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో (ఏ.బీ.ఎం సంఘం) నిర్వాహకులు జి.సులోమాన్, జీ.రాజన్న, జి.జమ్మన్న, జి.సుధాకర్, జి.జీవరత్నం, ఎస్.శాంతన్న, కానిపోగు పెద్దయ్య, జి.ఏలీషా, జి.రాముడు, పి.బాబు వైసీపీ నాయకులు కిరణ్ తదితర పాల్గొన్నారు.

# మడకశిరలో అక్రమ పేలుడు పదార్థాల స్వాధీనం



**మడకశిర, ఫిబ్రవరి 26: (రిపబ్లిక్ న్యూస్)** మడకశిర పట్టణ శివారులోని శివపురం సమీపంలో గురువారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో పోలీసులు భారీగా అక్రమంగా నిల్వ ఉంచిన పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. మడకశిర యు.పి.ఎస్. ఇన్స్పెక్టర్, మహిళా ఎస్.ఐ. లావణ్య మరియు సిబ్బంది ఆధ్వర్యంలో గోల్ల బాలాజీ (తండ్రి చంద్రప్ప) వారి వ్యవసాయ భూమిపై దాడి జరిపి, అక్కడ నిల్వ ఉంచిన పేలుడు పదార్థాలను పంచనామా ద్వారా స్వాధీనం చేశారు.స్వాధీనం చేసిన పదార్థాలుజెలటిన్ కర్రలు 450 విద్యుత్ డెటోనేటర్లు 22,000 భద్రతా ఫ్యూస్ తీగ 15 పెట్టెలు డెటోనేటింగ్ తీగ 2 పెట్టెలు యూరియా సంచి సుమారు 45 కిలోలు ఎక్సెల్ గొట్టాలు 20 సంఖ్యలతో 1 కట్ట చట్టపరమైన చర్యఈ ఘటనపై క్రైం నంబర్ 19/2026 కింద కేసు నమోదు చేసి, పేలుడు పదార్థాల చట్టం, 1908 లోని సెక్షన్ 5 ప్రకారం చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోంది.

# నేషనల్ మిషన్ ఆన్ నాచురల్ ఫార్మింగ్ పోగ్రామ్

## సెలెక్ట్ చేసిన గ్రామాలలో వ్యవసాయ శాఖ వారి సహకారంతో మట్టి నమూనాలు







**ఎమ్మిగనూరు, ఫిబ్రవరి, 26,(రిపబ్లిక్ న్యూస్ ):**

కర్నూలు జిల్లాలో సెంట్రల్ గవర్నమెంట్ చేపట్టిన నేషనల్ మిషన్ ఆన్ నాచురల్ ఫార్మింగ్ పోగ్రామ్ లో కొత్తగా సెలెక్ట్ చేసిన గ్రామాలలో వ్యవసాయ శాఖ వారి సహకారంతో మట్టి నమూనాలు తీయడం జరుగుతుంది. రైతు సాధికార సంస్థలో పనిచేసే ప్రతి ఒక క్యాడర్ కూడా తన సొంత పొలంలో 0.20 సెంట్లలో ఏటీఎం మోడల్ అలాగే 1 ఎకరం లో ఏ గ్రేడ్ మోడల్ చేస్తున్నారు.ప్రకృతి వ్యవసాయం ఎవరూ చేయకపోతే గౌరవనీయులైన జిల్లా కలెక్టర్ మేడం గారు ప్రకృతి వ్యవసాయ పొలాలను విసిట్ చేసి రైతులతో కూడా మాట్లాడటం జరిగింది.అదే విధంగా ఇతర దేశాలు అనగా ఫ్రాన్స్ మరియు జర్మనీ నుంచి కర్నూలు జిల్లా కి వచ్చిన శాస్త్రవేత్తలు ఈ నెల లోనే ప్రకృతి వ్యవసాయం చేస్తున్న వారి పొలాలను విసిట్ చేసి రైతులు ఏ విధంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో మోడల్స్ వేస్తున్నారో అడిగి తెలుసుకోవడం జరిగింది.ఒకవేళ మీరు తెలిపినట్టుగా ప్రకృతి వ్యవసాయం ఎవరూ చేయని యెడల ఇతర దేశాల నుంచి శాస్త్రవేత్తలు ఎందుకు వస్తారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అందరూ కష్టపడి పని చేస్తున్నారు కాబట్టి ఆ దేశస్తులు విజిట్లకు వస్తున్నారు.
మండల స్థాయి కన్వర్జేష్ మీటింగ్ లు మరియు వివో లెవెల్ లో మీటింగ్లకు అదే విధంగా ఖర్చుతో కూడిన ఆల్వేన్స్ రైతులను సన్మానం చేయడానికి శాలువలుతో , ఖర్చు పెట్టాలి అవి అన్ని కూడా స్టేట్ వారి ఆదేశాల ఇచ్చారుఅన్ని కూడా క్రింది స్థాయి సిబ్బంది కి జిల్లా నుంచి అందచేయటం జరిగింది. ఎకడ కూడా పొరపాటులు జరగలేదు

# బాలుర వసతి గృహంలో "డ్రగ్స్ వద్దు బ్రో" కార్యక్రమం ఏర్పాటు

## ఇన్స్పెక్టర్ అస్రార్ భాష







**నంద్యాల క్రైం, ఫిబ్రవరి 26, (రిపబ్లిక్ న్యూస్):** ఈగల్ టీంతో పాటు నంద్యాల పట్టణంలోని ప్రముఖ జూనియర్ కళాశాల యొక్క బాయ్స్ హాస్టల్ నందు గురువారం టూ టౌన్ ఇన్స్పెక్టర్ అస్రార్ భాష దేశాన్ని ప్రేమించే ఏ వ్యక్తి కూడా డ్రగ్స్ ముట్టుకోరు అనే నినాదంతో డ్రగ్స్ వద్దు బ్రో కార్యక్రమం ఏర్పాటు చేయడంతో పాటు విద్యార్థులకు గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం వలన వచ్చే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించడం జరిగింది. మాదకద్రవ్యాలు రవాణా చేసిన వినియోగించిన విక్రయించిన చట్ట ప్రకారం నేరంగా పరిగణించడం జరుగుతుంది. మత్తు పదార్థాలకు దూరంగా ఉండి మీ బంగారు భవిష్యత్తును కాపాడుకోవాలని పలు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది. మత్తుపదార్థాలకు సంబంధించిన సమాచారం ఉంటే పోలీసులకు కానీ ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు కాల్ చేసి తెలియజేయాలని, తెలియజేసిన వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలియజేయడం జరిగింది.

# అంబేద్కర్ విశిష్ఠ సేవా రత్న అవార్డు కు రంగయ్య ఎంపిక పట్ల పలువురు హర్షం

## -యస్ సి యస్ టీ బీసీ మైనారిటీ ల సమస్యలపై పోరాటలలో రాష్ట్ర స్థాయి గుర్తింపు

## శుభాకాంక్షలు తెలిపిన పలువురు ప్రముఖులు






**ఎమ్మిగనూరు, ఫిబ్రవరి, 26,(రిపబ్లిక్ న్యూస్ )** గత నెలలో పెద్దలు గౌరవనీయులు మాల్లెల వెంకట్రావ్ గారు మరియు గోళ్ళ అరుణ్ కుమార్ గారు ఆధ్వర్యంలో రాబోయే మాలల భవిష్యత్ కార్యాచరణ గురించి గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయిలో జరిగిన మాలల ఆత్మీయ కలయిక సమావేశంలో జాతీయ స్థాయి నాయకులు ఉద్యమకారులు వేల సంఖ్య లో పాల్గొని రాబోయే కార్యాచరణ పై దిశ నిర్దేశం చేశారు. ఆ సమావేశానికి ముఖ్య అతిథి గా ఆహ్వానం ఉన్న కొన్ని అనివార్య కారణాల వల్ల హాజరు కాలేకపోయానని రంగయ్య గారు తెలిపారు.దళిత యస్ సి యస్ టీ బీసీ మైనారిటీ ల సమస్యలపై పోరాట ఉద్యమాలలో రంగయ్య గారికి రాష్ట్ర స్థాయి గుర్తింపు లభించడం తో రాష్ట్ర స్థాయి అవార్డు కి ఎంపిక అయ్యారు. ఈ విషయం తెలుసుకున్న రాయలసీమ ప్రాంతం దళిత నాయకులు ఉద్యమకారులు రాజకీయ ప్రముఖులు మేధావులు శుభాకాంక్షలు తెలియజేసారు. ఉద్యమాలలో నీతి నిజాయితీ తో పేదలకు అండగా ఎప్పుడు ఉంటామని ఈ గుర్తింపు మరింత బాధ్యతను పెంచింది అని రాష్ట్ర ప్రజలు మాపై చూపిస్తున్న అభిమానం ఎనలేనిది అని ఆ గౌరవం ని కాపాడుకోడానికి ప్రాణం పణంగా పెట్టి దళిత కుటుంబం లకు అండగా ఉంటామని రంగయ్య తెలిపారు.

# రాజనాల బండకు దేవరెద్దు పట్టివేత



**చౌడేపల్లి ప్రతినిధి ఫిబ్రవరి 26 రిపబ్లిక్ న్యూస్** సత్య ప్రమాణాలకు పేరుగాంచిన రాజనాల బండకు దేవర ఎద్దును పట్టుకున్నారు రాజనాల బండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆంజనేయస్వామి ఆలయాలకు సంబంధించిన మూడు దేవతలు ఉన్నాయి. ఆ మూడింటిలో ఇటీవల ఒక ఎద్దు మరణించింది దీంతో దిగువపల్లి పంచాయతీ చుట్టుపక్కల గ్రామాలలో ఉన్న నాటు ఆవులన్నీ కాపునీకుంట వద్దకు చేరవేశారు శాస్త్ర సూక్తంగా ఆవు దూడ ఒకే చోట ఉన్న ఆహారాన్ని భుజించడంతో దానిని దేవరెద్దుగా పరిగణించి దేవుడికి వదిలేశారు. మోట్లపల్లికి చెందిన రెడ్డి వారి కృష్ణప్ప ఆవు దూడను దేవుడు నిర్ణయించాడని సాంస్కృతిక కార్యక్రమాల మధ్య తీసుకొని వచ్చారు. దేవర ఎద్దు రాజనాల పండుగ తీసుకొచ్చిన ఆనందంలో భక్తులు పలు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామస్తులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# పుంగనూరు న్యాయస్థానం ఏజీపీగా చౌడేపల్లి సురేష్ నియామకం



Scanned with CamScanner

**చౌడేపల్లి ప్రతినిధి ఫిబ్రవరి 26 రిపబ్లిక్ న్యూస్** పుంగనూరు న్యాయస్థానంలో ఏజీపీగా చౌడేపల్లి కి చెందిన బూరగల సురేష్ బాబు నియమితులయ్యారు. మండల కేంద్రమైన చౌడేపల్లికి చెందిన ఆయన పుంగనూరు న్యాయస్థానంలో సీనియర్ న్యాయవాదిగా పనిచేస్తున్నారు ఆయనను అన్నమయ్య జిల్లా పుంగనూరు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ,) గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. న్యాయవాది సురేష్ బాబు, మూడు సంవత్సరాలు పాటు ఏజీపీగా కొనసాగుతారని ఉత్తర్వులు జారీ చేశారు ఏజీపీగా బాధ్యతలు చేపట్టనున్న ఆయనను స్థానికులు అభినందించారు.

# ఆపరేషన్ చిన్నారి తల్లి ప్రత్యేక డ్రైవ్

## ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా

అమరావతి,**ఫిబ్రవరి 26, (ప్రజా రిపబ్లిక్ న్యూస్)** సురక్షిత బాల్యంతోనే సుస్థిర భవిష్యత్తు ఉంటుందని ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా వ్యాఖ్యానించారు. ఏపీ వ్యాప్తంగా 'ఆపరేషన్ చిన్నారి తల్లి' ప్రత్యేక డ్రైవ్ ప్రారంభించి నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన 'ఆపరేషన్ చిన్నారి తల్లి' పోస్టర్‌ను మంగళగిరి డీజీపీ కార్యాలయం లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీజీపీ మీడియాతో మాట్లాడారు. చిన్నారులపై లైంగిక నేరాల నివారణెళి లక్ష్యంగా చర్యలు చేపట్టామని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా పేర్కొన్నారు. పోక్సో కేసుల్లో జీరో పెండెన్సీ – 60 రోజుల్లో ఛార్జ్‌షీట్లు, స్పీడ్ ట్రయిల్ మానిటరింగ్ ద్వారా శిక్షల శాతం పెంచుతున్నామని తెలిపారు. తరచూ లైంగిక నేరాలకు పాల్పడే వారిపై సెక్సువల్ ఆఫెండర్స్ షీట్స్) నమోదు చేస్తున్నామని స్పష్టం చేశారు. సున్నిత ప్రాంతాల్లో పటిష్టమైన రాత్రి గస్తీ నిర్వహిస్తున్నామని తెలిపారు. పాఠశాలలు, అంగన్వాడీలు, హాస్టళ్లలో 'గుడ్ టచ్ – బ్యాడ్ టచ్'లపై అవగాహన కార్యక్రమాలు... చిన్నారుల తల్లులను అప్రమత్తం చేస్తున్నామని వివరించారు. బాధితులకు కౌన్సిలింగ్, పునరావాస సహాయం కల్పిస్తున్నామని చెప్పుకొచ్చారు. మహిళలు, చిన్నారుల భద్రతకు పెద్దపీట వేస్తున్నామని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా స్పష్టం చేశారు.

# మహిళలు లేకుంటే వ్యవసాయరంగం లేదు మహిళలు ఎంతో శక్తివంతులు

## ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మరియు మహిళా సమైక్య ఆధ్వర్యంలో కర్నూలు నగరంలో పత్రికా సమావేశం




**కర్నూలు ప్రతినిధి ఫిబ్రవరి 26, (ప్రజా రిపబ్లిక్ న్యూస్)** ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే జగన్నాథం మరియు ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి పి శ్రావణి రెడ్డి గురువారం రోజు

మాట్లాడుతూ మహిళా రైతులను ప్రభుత్వ ప్రోత్సహించడం లేదని అన్నారు వ్యవసాయ రంగంలో ఎక్కువ పాత్ర మహిళలది ఉన్నది పురుషుల కన్నా ఎక్కువ గంటలు శ్రమ చేస్తున్నారు, ప్రతిరోజు పంట పొలాల్లో పనిచేసే వారు మహిళలే ఇలాంటి మహిళలను ప్రోత్సహిస్తే వ్యవసాయంలో మరింత దిగుబడి సాధించవచ్చు నాణ్యమైన విత్తనాలు పురుగు నివారణ చర్యలు వాడకం మార్కెటింగ్ ఏ పంట వేస్తే ఎంత దిగుబడి వస్తుందనేటువంటి అవగాహన తదితర విషయాలన్నీ మహిళా రైతులకు తెలియజేయాలి అంటే మహిళా రైతులకు మండల స్థాయిలో వ్యవసాయ అధికారులు శిక్షణ ఇచ్చి వారిని వ్యవసాయంలో అధిక దిగుబడి సాధించే మహిళలుగా తీర్చిదిద్దాలఅని ఈ బాధ్యత ప్రభుత్వానిదే మహిళా రైతులకు వ్యవసాయంలో ఉన్నటువంటి అన్ని రకాల అప్పులను మాఫీ చేయాలఅని పురుషుల కన్నా మహిళలకే వ్యవసాయ మీద ఆసక్తి అంతేగాక మేకలు, గొర్రెలు, కోళ్ళు తదితర పెంపకంలో కూడా మహిళల పాత్ర చాలా ఉన్నది కావున పశు సంవర్ధక శాఖ కూడా ఆలోచన చేసి గొర్రెల పెంపకము కోళ్ల పరిశ్రమ మేకలు ఎడ్ల బళ్ళు (ఎద్దుల బండ్లు) నాణ్యమైన విత్తనాలు అధిక దిగుబడి సాధించడానికి తీసుకోవాల్సినజాగ్రత్తలు తదితర విషయాల పైన మహిళా రైతులకు తగిన ప్రోత్సాహకాలు ఇవ్వాలఅని ప్రస్తుత కాలంలో మన దేశంలో పురుషుల కన్నా మహిళలే పంట పొలాల్లో ఎక్కువగా కలుపులు కోతలు నూర్పిడి తదితర అన్ని విషయాల్లో కూడా పురుషులకు చేదోడుగా వాదోడుగా ఉండేది మహిళలే ఈ సందర్భంగా మహిళలు 10 మంది ఉంటే పురుషులు ఒకరు ఇద్దరు మాత్రమేపనిచేస్తున్నారని కావున మహిళలు లేకుండా వ్యవసాయ రంగం లేదుమహిళలుతమ కుటుంబాన్ని చూసుకుంటూ పంట పొలాలు కూడా కాపాడుతున్నారు, మన దేశంలోఏమాత్రం వ్యవసాయంలో దిగుబడి వస్తున్నదంటే దానికి మహిళలు అని చెప్పుకోవాలని ఇలాంటి పరిస్థితుల్లో మహిళలనుచిన్నచూపుచూడకుండా వారికి పండ్ల తోటల పెంపకము పూల తోటలు పెంపకము హార్టికల్చర్ పట్టుపురుగుల పెంపకం తదితరి విషయాల్లో కూడా తగిన అవగాహన కల్పించి శిక్షణ ఇవ్వాల ని ఇవన్నీ కూడా ప్రభుత్వము ప్రత్యేక చర్య తీసుకొని మహిళా రైతులకు తగిన శిక్షణను ఇచ్చే విధంగా చూడాలని ఈ శిక్షణను కూడా జిల్లా స్థాయిలో కాకుండా ప్రతి మండలములో ప్రతి సంవత్సరము దశలవారీగా గ్రామాల వారీగా శిక్షణ ఇస్తే మరింత దిగుబడి తీయడానికి అవకాశం ఉన్నది కావున ఈ విషయాన్ని గుర్తించి తక్షణమే ప్రభుత్వము తగిన చొరవ చూపాలని అన్నారు ఈ సంవత్సరము కర్నూలు జిల్లాలో మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళ రైతుల దినోత్సవం కూడా పాటించి జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఈ మహిళా రైతుల దినోత్సవాన్ని జరుపుకోవాలని వ్యవసాయంలో రాటు తేలిన అధిక దిగుబడి తెస్తున్న రైతుల ను సన్మానించాలని ఈ సందర్భంగా వారు అన్నారు ఈ పత్రిక విలేకరు సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి దంభోళం శ్రీనివాసరావు మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు వా.గిడ్డమ్మ నగర కార్యదర్శి భారతి కల్లూరు మండల రైతు సంఘం కార్యదర్శి బి రాముడు అధ్యక్షులు కృష్ణ నాయకుతరులు పాల్గొన్నారు

రిపబ్లిక్ – ప్రతి అక్షరం ప్రజల కోసం – RNI No:/2023/87888

# చెత్త సేకరణలో నిర్లక్ష్యం కనిపించకూడదు

**ఇంటింటా చెత్త సేకరణ తప్పనిసరి**

**ప్రజలు పారిశుద్ధ్య కార్మికులకే చెత్తనందించాలి**

**పనులను పరిశీలించిన కమిషనర్ జస్వంత రావు**



**అనంతపురం కార్పొరేషన్, ఫిబ్రవరి 26,(రిపబ్లిక్ న్యూస్):** రోజువారి పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా కమీషనర్ జస్వంత రావు గురువారం సాయి నగర్ 3వ క్రాస్ దగ్గర కంపాక్టర్ ద్వారా చెత్త సేకరణ చేస్తున్న పనులను పర్యవేక్షించారు. తదుపరి ప్రధాన రహదారులు సుభాష్ రోడ్, టవర్ క్లాక్ ఏరియా, రైల్వే స్టేషన్ రోడ్డు, యం. జీ కాలనీ, గుత్తి రోడ్, బస్టాండ్ రోడ్డు, సూర్య నగర్, గాంధీ బజార్,, మార్కెట్ ఏరియా, జేఎన్టీయూ రోడ్డు, ఆర్టీవో ఆఫీసు రోడ్డు, రాజీవ్ చిల్డ్రన్స్ పార్క్ ఏరియా హౌసింగ్ బోర్డ్, ఆదర్శనగర్ అరవిందనగర్ ,రాంనగర్, మారుతి నగర్ నందు పారిశుద్ధ్య పనులు పలు ప్రాంతాలలోపరిశీలించారు.

**డివిజన్ ల కాలువల్లో ఎప్పటికప్పుడు పూడికతీత**

నగరంలోని వివిధ డివిజన్లో చేపడుతున్న చెత్త సేకరణ పనులు నిర్లక్ష్యం కనిపించకూడదని, ప్రతి సర్కిల్లో చెత్త సేకరణ పక్కాగా చేపట్టాలని, అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని ప్రజారోగ్య అధికారులకు నగరపాలక సంస్థ కమిషనర్ జస్వంత్ రావు హెచ్చరించారు. గురువారం నగరంలోని వివిధ డివిజన్లో కమిషనర్ చెత్త సేకరణ పనులను పరిశీలించారు. పలు సర్కిల్లో చెత్త సేకరణ జాప్యం కావడంపై మరోసారి ఇటువంటి పరిస్థితులను తలెత్తకుండా సకాలంలో చెత్త సేకరణ చేపట్టాలన్నారు. వివిధ డివిజన్ ల కాలువల్లో ఎప్పటికప్పుడు పూడికతీత పనులు చేపట్టాలన్నారు. చెత్తనిర్వహణ పనులను శానిటేషన్ ఇన్స్పెక్టర్లు, కార్యదర్శులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. వేకువజామునే విధులకు హాజరై చెత్తను సకాలంలో తరలించేలా చూడాలన్నారు. ప్రతి పారిశుద్ధ కార్మికుడు అప్రాన్ వేసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నగర సుందరీకరణలో భాగంగా ప్రజలు చెత్త నిర్వహణకు సహకరించాలన్నారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకూడదని నగరపాలక సంస్థ సిబ్బందికే చెత్తనందించాలన్నారు. హోటల్ నిర్వాహకులు రెస్టారెంట్లు నిర్వాహకులు విధిగా డస్ట్ బిన్ ఏర్పాటు చేసుకోవాలి అన్నారు.

**చెత్తకుప్పలను కాల్చడం ఆరోగ్యానికి హానికరం**

మూడు ట్రిప్పులు తిరగాల్సిందే : నగరపాలక సంస్థ పరిధిలో ఉండే చెత్త ట్రాక్టర్లు, వాహనాలు నిర్దేశానుసారం చెత్తను కంపోస్టుకు తరలించాలన్నారు ప్రధానంగా చెత్త ట్రాక్టర్లు మూడు ట్రిప్పులు చెత్తను కంపోస్టుకు తరలించాలన్నారు. ప్రతి కార్మికుడు తప్పకుండా అప్రాన్ ధరించాలని, ఒకవేళ ధరించకుండా వస్తే డ్యూటీకి అవసరం లేదని ఆయన తెలియజేశారు. మున్సిపల్ వర్కర్ పని చేస్తున్నాడంటే ప్రజల్లో ఒక గుర్తింపు ఉంటుంది. ప్రతి కార్మికుడు గుర్తుపెట్టుకోవాల్సింది, చెత్తకుప్పలను కాల్చడం మన ఆరోగ్యానికి హానికరం, కావున నగరంలో చెత్తకుప్పలు కాల్చే ప్రదేశాలను గుర్తించి, ఆ ప్రదేశాలలో భవిష్యత్తులో చెత్త కాల్చకుండా ఉండడానికి తగు చర్యలు తీసుకోవాలని సంబంధించిన అదికారులకు ఆదేశించారు. కమిషనర్ వెంట ఎమ్ హెచ్ ఓ బిఎల్ నరసింహ, శానిటేషన్ ఇన్స్పెక్టర్లు, కార్యదర్శులు తదితరులున్నారు.

# ట్రాన్స్ఫార్మర్ ధ్వంసం చేసి కాఫర్ వైరు చోరీ

**125 కేవీ ట్రాన్స్ఫార్మర్ లోని 210 లీటర్ల ఆయిల్, 50 కేజీల కాఫర్ వైరు అపహరణ**

**బండి ఆత్మకూరు ఎత్తిపోతల పథకం వద్ద ఘటన**

**ఆందోళనలో రైతన్నలు**





**బండి ఆత్మకూరు, ఫిబ్రవరి 26,( రిపబ్లిక్ న్యూస్):-** కాఫర్ వైరు దొంగిలించే కేటుగాళ్లు పోలీసులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. మండలంలో తరచూ ఏదో ఒకచోట విద్యుత్ మోటార్లు ఎత్తుకెళ్లడం, మోటార్లకు అమర్చిన కాపర్ వైర్ ను దొంగిలించడం పరిపాటిగా మారింది. అయితే ఇప్పుడు ఏకంగా విద్యుత్తు ట్రాన్స్ఫార్మర్ ధ్వంసం చేసి అందులోని కాఫర్ వైరు, ఆయిల్ ఎత్తుకెళ్లడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఈ ఘటన బండి ఆత్మకూరు మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక మోడల్ స్కూల్ సమీపంలో రైతుల సాగునీటి అవసరాల కోసం ఆనాటి నంద్యాల ఎంపీ ఎస్పీవై రెడ్డి ఎత్తిపోతల పథకం కింద విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేశారు. సుమారు 300 ఎకరాలకు సాగునీరు అందించే సామర్థ్యం కలిగిన విద్యుత్ మోటార్లను అమర్చారు. వాటి నిర్వహణ బాధ్యత రైతులకే అప్పగించారు. అంతవరకు బాగానే ఉన్నా కాఫర్ వైరు దొంగిలించే కేటుగాళ్లు ఒక పథకం ప్రకారం అక్కడ ఏర్పాటు చేసిన 125 కేవీ విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ను ధ్వంసం చేసి అందులోని సుమారు 50 కేజీల కాఫర్ వైరు, సుమారు 200 లీటర్లకు పైగా ఆయిల్ ను అపహరించుకుపోయినట్లు ఎత్తిపోతల పథకం రైతు కమిటీ సభ్యులు సుజాతమ్మ గురువారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ ఐ జగన్ మోహన్ ఘటనా స్థలానికి వెళ్లి చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. అలాగే ఈ విషయాన్ని సుజాతమ్మ విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ క్రమంలో విద్యుత్ శాఖ ఏఈ కంబగిరి ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. వీటి విలువ సుమారు రూ 1.50 లక్షల వరకు ఉంటుందని ఆయన తెలిపారు. కాగా విద్యుత్తు మోటార్ల వైర్లు కోసుకెళ్లే కేటుగాళ్లు ఇప్పుడు ఏకంగా 125 కెవి విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ని ధ్వంసం చేసి అందులోని కాఫర్ వైరు, ఆయిల్ ఎత్తుకేళ్లడం మండల వ్యాప్తంగా చర్చినియాంశంగా మారింది. విద్యుత్తు సరఫరా ఉన్నప్పటికీ చాక చక్యంగ విద్యుత్తు సరఫరా తొలగించి వాళ్లు వెంట తెచ్చుకున్న పరికరాలతో ట్రాన్స్ఫార్మర్ ధ్వంసం చేసి అందులోని కాఫర్ వైరు, ఆయిల్ ఎత్తుకేళ్లడం ఆందోళన కలిగించే అంశంగా మారింది. ఎక్కడ చూసినా విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు ఊరికి చివరన, పొలాల మధ్యనే ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఈ ఘటనతో, మరి ఇలాంటి కేటుగాళ్లతో వాటికి రక్షణ ఎలా ఉంటుందనేది ప్రశ్నార్ధకంగా మారింది.

# సమాజానికి మార్గదర్శకులు జర్నలిస్టులు

**జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ -అర్హులైన జర్నలిస్టులకు రెండవ దఫా మంజూరు చేస్తాం**

**కలెక్టర్, అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ ఓ.ఆనంద్**





**అనంతపురం కలెక్టరేట్, ఫిబ్రవరి 26,(రిపబ్లిక్ న్యూస్):** జర్నలిస్టులు సమాజానికి మార్గదర్శకులు అని కలెక్టర్, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. గురువారం ఉదయం అనంతపురం కలెక్టరేట్ లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో 2026 – 27వ సంవత్సరానికి సంబంధించి జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులను జిల్లా కలెక్టర్ పంపిణీ చేసి ప్రారంభించారు.

**కార్డులను జర్నలిస్టులు సద్వినియోగం చేసుకోవాలి**

ఈ సందర్భంగా కలెక్టర్, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ నియమ నిబంధనలను అనుసరించి అర్హత కలిగిన ప్రతి ఒక్క జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా జర్నలిస్టులు పనిచేయాలన్నారు. అక్రిడిటేషన్ కార్డులను జర్నలిస్టులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హులై ఉండి ఇంకనూ మిగిలిపోయి ఉన్న జర్నలిస్టులకు త్వరలోనే రెండవ దఫా కమిటీ సమావేశంలో మంజూరు చేస్తామని తెలిపారు.

**తొలి విడతగా 607 అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ**


జిల్లా అక్రిడిటేషన్ కమిటీ ఆమోదం మేరకు అనంతపురం జిల్లాలో తొలి విడతగా 607 అక్రిడిటేషన్ కార్డులను పంపిణీ చేయనున్నామని ఐ.అండ్.పీఆర్ డిఐపిఆర్ఓ మరియు డిఎంఏసి మెంబర్ కన్వీనర్ ఏ.బాలకొండయ్య తెలిపారు. గురువారం నుంచి అక్రిడిటేషన్ కార్డులను పంపిణీ జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి కార్యాలయంలో పని దినాలలో పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు ఏ.షఫీఉల్లా, ఆర్.రామంజినేయులు, ప్రసాద్, ఐ.అండ్.పీఆర్ ఏపీఆర్ఓ ఫక్రుద్దీన్, పిఆర్ఓ వి.సూర్యనారాయణ రెడ్డి, టైపిస్ట్ దామోదర్ రెడ్డి, టెక్నీషియన్ కమల్, ఫోటోగ్రాఫర్ కోటప్ప, తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ అండ్ చెక్కులను పంపిణీ చేసిన కూడా చైర్మన్ రూపానంద రెడ్డి.



**ఓబులవారిపల్లి ఫిబ్రవరి 26 రిపబ్లిక్ న్యూస్.**

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను కూడా చైర్మన్ రైల్వే కోడూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి ముక్కా రూపానంద్ రెడ్డి పంపిణీ చేశారు, రైల్వే కోడూరు మండలం బుడి గుంటపల్లి తమ్మిశెట్టిపల్లి రైల్వేకోడూరు వాపనపల్లి వెంకటరెడ్డి పల్లి జంగిటివారిపల్లి పొట్టి రాజు గారి పల్లి మాధవరంపాడు ఉప్పరపల్లి యానాదపల్లి కొత్తపల్లి మొదలకు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు గురువారం ఆయన గ్రామాలకు వెళ్లి లబ్ధిదారుల స్వగృహంలో చెక్కులు పంపిణీ చేయడం జరిగినది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు నిమిత్తం ఈ ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పేద ప్రజలకు అందువడం జరుగుతుందని ప్రభుత్వం పేదల అభ్యున్నతికి అభివృద్ధికి మంచి మంచి పథకాలు ప్రవేశపెడుతుందని అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు అందుతాయని ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో ఇండియా కూటమి నాయకులు కార్యకర్తలు పలువురు ప్రభుత్వ అధికారులు పాల్గొనడం జరిగినది,



# చంద్రబాబు గారికి పలు సమస్యలపై వినతి

**- ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ**



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని కలిసిన శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ, ఏ డి సి సి బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి తదితరులు

**అమరావతి సంక్షేమం, ఫిబ్రవరి 26,(రిపబ్లిక్ న్యూస్):** అసెంబ్లీలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారిని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ, మడకశిర ఎమ్మెల్యే యం.యస్.రాజు, ఏ.డి.సి.సి. ఛైర్మన్ కేశవరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ముఖ్యంగా నియోజకవర్గ పరిధిలోని గార్లదిన్నె, శింగనమల మండలాల రైతులకు మిడ్ పెన్నారు సౌత్ కెనాల్ కింద ఉన్న 1 నుండి 9వ డిస్ట్రిబ్యూటరీ ల దుస్థితి కారణంగా సాగునీటి కై పలు సమస్యలు ఎదురవుతున్నాయి, దశాబ్దాల కాలంగా మిడ్ పెన్నారు సౌత్ కెనాల్ ద్వారా శింగనమల, బుక్కరాయ సముద్రం, నార్పల మండలాలకు సాగునీరు సక్రమంగా అందక, కాలువలు పాతబడటం, బురదమయం కావడం, నిర్మాణాలు దెబ్బతినడం వలన నీటి ప్రవాహ సామర్థ్యం దెబ్బతింది. సహజ వాగులు, వంకలు గూండా ప్రవహించడం వల్ల సాగునీటి నష్టాలు జరుగుతున్నాయి. ఈ సమస్య పరిష్కారానికి గతంలో నిలిచిపోయిన బైపాస్ కాలువ పనులు పునఃప్రారంభించాలని కోరారు. అలంక రాయపేట నుండి సలకంచెరువు, శింగనమల గ్రామాలకు ప్రధాన రోడ్డు మార్గమైన కూతలేరు వంక పై బ్రిడ్జి లేక రైతులు, ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారని. కావున కూతలేరు వంక పై బ్రిడ్జి, రహదారి ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

**అంబేద్కర్ భవన్ ఏర్పాటుకు నిధులు మంజూరు**

బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో అంబేద్కర్ భవన్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని, అలాగే రానున్న వేసవి దృష్ట్యా నియోజకవర్గానికి అధిక నిధులు విడుదల చేసి సాగునీరు,తాగునీరు సమస్య లేకుండా చేసేందుకు సహకారం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారిని కోరారు. వినతి చేసిన సమస్యలపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ తెలిపారు.

# ఎండను లెక్కచేయకుండా కొనసాగుతున్న యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే



**ఓబులవారిపల్లి ఫిబ్రవరి 25 రిపబ్లిక్ న్యూస్.**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే మండల అభివృద్ధి అధికారి విజయరావు ఆదేశాల మేరకు డిప్యూటీ మండల అభివృద్ధి అధికారి కృష్ణ ఆధ్వర్యంలో ఎండను కూడా లెక్క చేయకుండా సర్వే ని త్వరితగతిన పూర్తి చేయాలన్న లక్ష్యంతో అధికారులు సర్వే నిర్వహిస్తున్నారు . వివరాల్లోకి వెళితే యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేలో భాగంగా గురువారం మండల కేంద్రం ఓబులవారిపల్లి లోని బొమ్మివారి పల్లి గ్రామంలో సర్వే నిర్వహించడం జరిగినది, ఈ సందర్భంగా డిప్యూటీ మండల అభివృద్ధి అధికారి కృష్ణ మాట్లాడుతూ సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించడం వల్ల గ్రామీణ ప్రాంత ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి పలాలు అయితే నేమి వారు అందుకోవాల్సిన పెన్షన్లు,రేషన్ కార్డులు,ఆధార్, విద్యార్థులకు సంబంధించిన సర్టిఫికెట్స్, తదితర సర్టిఫికెట్స్ అన్నింటికీ ఈ సర్వే ఉపయోగపడుతుందని ఈ సర్వే వల్ల గ్రామీణ ప్రాంత పేద ప్రజలు ప్రభుత్వ పథకాలకు అర్హులైన వారికి పథకాలు అందుతాయని అన్నారు, అందువల్ల గ్రామీణ ప్రాంతాల ప్రజలు యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే లో అధికారులకు ఇంటిలోని సభ్యుల అన్ని వివరాలు అధికారులకు వెల్లడించాలని తెలియజేశారు, రంగనాథ మాట్లాడుతూ యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే పేదలకు ఎంతో ఉపయోగమని నూతన రేషన్ కార్డులు, పెన్షన్లు,తదితర ప్రభుత్వ పథకాలను పొందేందుకు చాలా ఉపయోగపడుతుందన్నారు ఈ కార్యక్రమంలో సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ హోసూరు రంగనాథ్, వెటర్నటీ అసిస్టెంట్ అవినాష్, వీఆర్ఏ బొమ్మి శివయ్య పాల్గొనడం జరిగినది,

## ఉమ్మడి మెదక్ జిల్లా సంగారెడ్డి మండలం పోతిరెడ్డి పల్లి చౌరస్తా లోని సర్వేనెంబర్ 153/4 153/5 153/25 విస్తీర్ణం 3-20 గల భూమిలో 2007



**ఆందోల్ ప్రతినిధి ఫిబ్రవరి 26( రిపబ్లిక్ న్యూస్)**

సంవత్సరంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం లో ఉన్నటువంటి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి గారి ఆధ్వర్యంలో పేదలకు 80 మంది కుటుంబాలకు పట్టా సర్టిఫికెట్లు జారీ చేయడం జరిగింది. మరియు పొజిషన్ కూడా చూపించడం జరిగింది. కానీ అక్కడ మౌలిక వసతులు లేనందున లబ్ధిదారులు అక్కడ నివాసం చేయలేకపోయినాను ప్రస్తుతం అక్కడ మౌలిక వసతులు అందుబాటులోకి వస్తున్న సందర్భంలో రోడ్లు వేసి కడీలు పాతడం లాంటి పనులను తెలియకుండా చేస్తున్నారు కాబట్టి దీన్ని రెవెన్యూ అధికారులు గుర్తించి అక్కడ జరుగుతున్నటువంటి పనులను నిలుపుదల చేసి వాస్తవమైన నిరుపేదలైన పట్టాదారులకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా తెలియజేయడం జరిగింది చాలా సందర్భాలలో ఎమ్మార్వో ఆర్డీవో కలెక్టర్ గారు సంప్రదించి ఇట్టి విషయాన్ని చాలా సందర్భాలలో వారికి దరఖాస్తులు విన్నవించడం జరిగింది

# ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరాలి

**మెదక్ జిల్లా నూతన కలెక్టర్ ప్రతిమా సింగ్**



**మెదక్ జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 26( రిపబ్లిక్ న్యూస్)**

ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు.

నూతన కలెక్టర్ కలెక్టరేట్ కు చేరుకోగానే జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, డి ఆర్ ఓ భుజంగ రావు,మెదక్ ఆర్డీవో రమాదేవి పూలమొక్క అందించి స్వాగతం పలికారు.

గురువారం మెదక్ జిల్లా నూతన కలెక్టర్ గా బాధ్యత చేపట్టిన కలెక్టర్ కు జిల్లా అధికారులు జిల్లా అధికారులు పూల మొక్కల తో స్వాగతం పలికి మర్యాదగా కలిశారు.

ఈ సందర్భంగా జిల్లా నూతన కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అప్పగించిన బాధ్యతను నెరవేర్చుతూ ,ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా కృషి చేస్తానన్నారు. ఇంటర్, పదో తరగతి పరీక్షల గురించి డీఈఓ ను, ఇంటర్ విద్యార్థి గారిని అడిగి తెలుసుకున్నారు. ప్రశాంతంగా పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జెడ్పి సీఈఓ ఎల్లయ్య, డి ఆర్ ఓ భుజంగరావు, జిల్లా అధికారులందరూ పాల్గొన్నారు.

# బంగారు కుటుంబాలకు మార్గదర్శుల మ్యాపింగ్‌ను వేగవంతం చేయాలి

**అవసరమైన సౌకర్యాలను గుర్తించి సమగ్ర సహాయం అందించాలి**

**వ్యవసాయ రంగ కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్‌లో జిల్లా ముందంజలోకి తీసుకురావాలి**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



**నంద్యాల, బ్యూరో ఫిబ్రవరి 26 (రిపబ్లిక్ న్యూస్)**


రాష్ట్రంలో పేదరిక నిర్మూలనను లక్ష్యంగా పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పి4 (ప్రభుత్వప్రైవేటుప్రజల భాగస్వామ్యం) కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. గురువారం విజయవాడ నుండి స్వర్ణాంధ్ర, జీరో పావర్టీ పి4 ప్రోగ్రామ్, కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ (కే పి ఐ ఎస్) తదితర అంశాలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆర్థిక & ప్రణాళిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీ పీయూష్ కుమార్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, సీపీఓ ఓబులేసు, నోడల్ అధికారులు, నియోజకవర్గ విజన్ ప్లాన్ యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి గారి సూచనల మేరకు స్వర్ణాంధ్ర జీరో పావర్టీ పి4 కార్యక్రమంలో జిల్లాను ముందంజలో నిలిపేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్‌పై ప్రతి నెలా సమీక్షలు నిర్వహిస్తూ లక్ష్యసాధనకు కట్టుబడి ఉన్నామని ప్రిన్సిపల్ సెక్రటరీకి వివరించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్, జిల్లాలో ఇప్పటివరకు 44,079 బంగారు కుటుంబాలను గుర్తించామని తెలిపారు. ఈ కుటుంబాలకు మార్గదర్శులను నియమించి, వారిని త్వరితగతిన మ్యాపింగ్ చేయాలని ఆదేశించారు. బంగారు కుటుంబాలకు అవసరమైన సహాయాన్ని మార్గదర్శుల ద్వారా సమర్థవంతంగా అందించాలన్నారు. ఉత్తమ సేవలు అందించిన మార్గదర్శుల వివరాలను మార్చి మొదటి వారంలోపు సమర్పించాలని నియోజకవర్గ విజన్ ప్లాన్ యూనిట్ సిబ్బందిని ఆదేశించారు. బంగారు కుటుంబాలకు వైద్యసంబంధిత అత్యవసర అవసరాలుంటే, డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా రూ. 25 లక్షల వరకు, అలాగే ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా రూ. 5 లక్షల వరకు ఉచిత వైద్యసదుపాయం లభిస్తుందని తెలిపారు. ఈ పథకాల గురించి అర్హులైన కుటుంబాలకు సమగ్ర అవగాహన కల్పించాలని సూచించారు. చికిత్స కోసం ఆలస్యం కాకుండా ముందస్తు రిజిస్ట్రేషన్ చేసుకునే విధానం, ఫోన్ ద్వారా నమోదు సౌకర్యం కూడా అందుబాటులో ఉన్నట్లు వారికి తెలియజేయాలన్నారు. ఈ ప్రక్రియలో నియోజకవర్గ విజన్ ప్లాన్ యూనిట్ నోడల్ అధికారులు పూర్తి సహకారం అందించాలని ఆదేశించారు. జిల్లాను వ్యవసాయ రంగంలోని కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్‌లో మరియు స్థూల దేశీయోత్పత్తి పెంపులో రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలపాలని కలెక్టర్ ఆకాంక్ష వ్యక్తం చేశారు. జిల్లాలోని సుమారు 70 వేల ఎకరాల బీడు భూములను సాగులోకి తీసుకురావడంలో వ్యవసాయ శాఖ కీలక పాత్ర పోషించిందని అభినందించారు. మహానంది మండలంలో తలసరి ఆదాయం అధికంగా ఉన్నప్పటికీ, పగిడ్యాల, గోస్పాడు, నందికొట్కూరు మండలాల్లో తలసరి ఆదాయం తక్కువగా ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. ఈ మండలాల్లో ఆదాయం పెంపుదలకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని నియోజకవర్గ విజన్ ప్లాన్ యూనిట్ సిబ్బందిని ఆదేశించారు. పేదరిక నిర్మూలన, ఆర్థికాభివృద్ధి, వ్యవసాయ పురోగతి…ఈ మూడు అంశాలను సమన్వయంతో అమలు చేస్తూ జిల్లాను ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

# కనుల పండుగగా అహోబలేశ్వరుడు బ్రహ్మోత్సవాలు

**శేష వాహనంపై దర్శనం ఇచ్చిన ప్రహల్లాదవరదుడు**



**ఆళ్లగడ్డ**



అహోబిల దివ్య క్షేత్రంలో బ్రహ్మోత్సవ వైభవం అమరాన్ని తాకుతోంది. దిగువ అహోబిలంలో ప్రహల్లాద వరద నరసింహస్వామి గురువారం శేష వాహనంపై మాడవీధుల్లో కనుల పండుగ ఊరేగింపు జరిగింది శేష వాహనంపై ప్రహల్లాద నరసింహ స్వామి వేలాదిమంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారుబ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదవ రోజైన గురువారం దిగువ అహోబిలంలో వెలిసిన శేష వాహనము లో విహరించిన ప్రహ్లాదవరదుడు వయ్యారంగా నడిచి వస్తున్న పత్తి ఉళా(వయ్యాళి)ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులను ఆలయ ప్రాంగణంలో నుండి అహోబిలం మతం కు చేరుకున్న ప్రహ్లాద నరసింహ స్వామిని అహోబలేశ్వరుని మఠం పీతాదిపతి శ్రీ రంగనాథ హేతేంద్ర మహాదేవ శిదన్ ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు భక్తులకు అందించారు

# ఆరోగ్య సేవలపై ప్రజా అభిప్రాయం మెరుగుపడాలి

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



**నంద్యాల, బ్యూరో ఫిబ్రవరి 26 (రిపబ్లిక్ న్యూస్)**

జిల్లాలో వైద్య శాఖ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలపై సానుకూల అభిప్రాయం పెరగాలంటే సేవల నాణ్యతను మెరుగుపరచాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి వైద్యాధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి మెడికల్ ఆఫీసర్లు, సీహెచ్‌సీ వైద్యులు, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ తదితరులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి సమయానికి, నాణ్యమైన వైద్య సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ముఖ్యంగా పెద్దఎమ్మనూరు, రుద్రవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద వైద్య సేవలపై ప్రజల్లో ప్రతికూల అభిప్రాయం ఉన్నట్లు గుర్తించినందున, అక్కడి వైద్యులు సేవా దృక్పథంతో వ్యవహరించి రోగులకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. అలాగే ఆళ్లగడ్డ సీహెచ్‌సీపై ఐవిఆర్ఎస్ కాల్స్ ద్వారా ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో, సేవల్లో లోపాలు పునరావృతం కాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో కూడా రోగులకు సకాలంలో చికిత్స, అవసరమైన సౌకర్యాలు అందేలా సూపరింటెండెంట్ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యుల ఖాళీ పోస్టులు లేకుండా వెంటనే భర్తీ ప్రక్రియను చేపట్టాలని డిఎంహెచ్ఓను ఆదేశించారు. ఆసుపత్రి పరిసరాలలో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, అవసరమైతే హెచ్‌డిఎస్ నిధులను వినియోగించి శానిటేషన్ మెరుగుపరచాలని తెలిపారు. వైద్య సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి, ప్రజలకు మర్యాదపూర్వకంగా సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఉచితంగా మందులు అందించడంతో పాటు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు పూర్తి స్థాయి వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డిఎంహెచ్ఓ డా. వెంకటరమణ, అదనపు డిఎంహెచ్ఓ డా. శారద, డిసిహెచ్ఎస్ డా. ఓ. లలిత తదితరులు పాల్గొన్నారు.

# మే 3న నీట్ పరీక్షలను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

**నంద్యాల, బ్యూరో ఫిబ్రవరి 26 రిపబ్లిక్ న్యూస్**

దేశవ్యాప్తంగా మే 3వ తేదీన నిర్వహించనున్న నేషనల్ ఎలిజిబిలిటీ కం ఎంట్రన్స్ టెస్ట్ (నీట్‌యూజి) పరీక్షలను జిల్లాలో అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. అమరావతి నుంచి నీట్ యూజి పరీక్షల డైరెక్టర్ జనరల్ ప్రదీప్ సింగ్ కరోలా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, డీఈఓ జనార్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో మొత్తం నాలుగు పరీక్షా కేంద్రాలలో 1,320 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బస్టాండ్ సమీపంలోని ప్రభుత్వ హై స్కూల్, టెక్కే జూనియర్ కళాశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పరీక్ష నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. పరీక్ష మధ్యాహ్నం




2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆఫ్‌లైన్ విధానంలో జరుగుతుందన్నారు. అభ్యర్థులను ఉదయం 11 గంటల నుంచి కేంద్రాల్లోకి అనుమతిస్తారు. మధ్యాహ్నం 1.30 గంటల తరువాత ఎట్టి పరిస్థితుల్లోనూ కేంద్రాల్లోకి ప్రవేశం ఉండదని స్పష్టం చేశారు. అభ్యర్థులు తప్పనిసరిగా అడ్మిట్ కార్డు, ఆధార్/పాన్/ఓటర్ ఐడి/డ్రైవింగ్ లైసెన్స్ వంటి చెల్లుబాటు అయ్యే గుర్తింపు కార్డు మరియు పోస్ట్‌కార్డ్ సైజు ఫోటో వెంట తెచ్చుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించబడవని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, విద్యుత్ అంతరాయం లేకుండా జనరేటర్లు సిద్ధంగా ఉంచాలని, తాగునీరు, తగిన వెలుతురు వంటి మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. దివ్యాంగ అభ్యర్థుల కోసం ప్రతి కేంద్రంలో రెండు వీల్‌చైర్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. అభ్యర్థులు అధిక ఒత్తిడిలో పరీక్ష రాస్తుండటంతో ఇన్విజిలేటర్లు సహానుభూతితో, సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా నీట్ యూజి పరీక్షల డైరెక్టర్ జనరల్ ప్రదీప్ సింగ్ కరోలా మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా పరీక్షా నిర్వహణలో నియమ నిబంధనలు కచ్చితంగా పాటించాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల సమీపంలోని జిరాక్స్ దుకాణాలు మూసివేయాలని, అవసరమైతే ప్రభుత్వ ఎయిడెడ్ కళాశాలలను కూడా కేంద్రాలుగా వినియోగించుకోవాలని సూచించారు. కేటాయించిన సామర్థ్యానికి 10 శాతం అదనంగా సీట్లు ఉంచేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

## సంఘ్ కార్యాలయం -ప్రేరణ కేంద్రంగా, సంపర్క సూత్రంగా

# సమాచార నిలయంగా వెలుగొందాలి

**వేడుకగా ఆర్ ఎస్ ఎస్ సంఘ్ కార్యాలయం ప్రారంభోత్సవం**

**నంద్యాల ఫిబ్రవరి 26( రిపబ్లిక్ న్యూస్) :**

నంద్యాల జిల్లా, ఆరు దశాబ్దాల పైగా స్వయం సేవకుల ఆకాంక్షల సాకారంగా నూతన జిల్లా కార్యాలయ ప్రారంభోత్సవం హర్షోల్లాసాల మధ్య శాస్త్రోక్తంగా గురువారం నిర్వహించారు. ముందు రోజు బుధవారం శాంతి హోమం నేడు గృహప్రవేశం, సత్యనారాయణ వ్రతం తో శాస్త్ర బద్ధంగా జరిగింది. తదుపరి విభాగ్ సంఘ్ చాలక్ నీలకంఠేశ్వరయ్య అధ్యక్షతన సమావేశమైన సభలో విద్యా భారతి క్షేత్ర కార్యకారిణి సదస్యులు డాక్టర్ గడ్డం రామకృష్ణారెడ్డి, ప్రముఖ నిర్మాణ సంస్థ పి ఏ వి గ్రూప్ వ్యవస్థాపకులు, ప్రస్తుత ఆర్ ఎస్ ఎస్ కార్యాలయ నిర్మాత పబ్బతి వేణు గోపాల్, ప్రధాన వక్త ప్రాంత ప్రచారక్ విజయ ఆదిత్య జీ, జిల్లా సంఘ్ చాలక్ చిలుకూరి శ్రీనివాస్ వేదిక నలంకరించారు. భవన నిర్మాణంలో విశేషంగా కృషి చేసిన వారిని లాంచనంగా



సత్కరించిన తదుపరి వక్త సందేశంలో మాధవ నిలయం, వివేకానంద సేవా సమితి సంయుక్త కార్యాలయాలు ఎంతో బాధ్యతాయుతంగా తమ సమాజ సేవా కార్యక్రమాలలో పునరంకిత మవ్వాలని పిలుపు నిచ్చారు. కార్యాలయం సమాజానికి ప్రేరణ దాయకంగా, కార్యాలయ సందర్శకులకు స్ఫూర్తినివ్వాలని తెలిపారు జిల్లాలోని అన్ని గ్రామాల్లోని సంఘ్ శాఖల, స్వయం సేవకుల పూర్తి సమాచారం కలిగిన సమాచారం కేంద్రంగా, నూతన సాంకేతికతను అంది పుచ్చుకుని, సదరు సమాచారాన్ని శాస్త్రీయంగా విశ్లేషించి, సమయాను కూలంగా వినియోగించుకుని సంఘకార్య సార్వ జనీనతకు కృషిచేయాలి.

**కార్యాలయం " సంపర్క సూత్రం"**

కార్యాలయం సందర్శించిన వారికి స్ఫూర్తి నివ్వడమే కాకుండా, వారి సమాచారాన్ని ప్రచారకులకు, ప్రచారకుల సమాచారాన్ని అందుబాటును వారికి అందించి సంపర్క సూత్రంగా వెలుగొందాలి.

మనం సమాజంలో ఏ ఆదర్శ మార్పులనైతే ఆశిస్తున్నామో, ఆ ఆదర్శాలన్నీ ఉత్కృష్ట స్థాయిలో మన కార్యాలయంలో ఆచరింప బడాలి. మనకు సమాజం ఇలాంటి ఆస్తులు ఎన్ని కల్పించినా సంఘ్ యొక్క ఏకైక ఆస్తి సంఘ్ శాఖ మాత్రమే, అందులో సాన పెట్టబడిన స్వయం సేవకులు మాత్రమే. సంఘ్ వ్యక్తి నిర్మాణం తప్ప మరే పని చేయదు. సంఘ్ శాఖలో తయారైన స్వయం సేవకులు మాత్రమే సమాజోద్ధరణ పనులు స్వచ్ఛందంగా చేపడతారు.

సదరు కార్యక్రమంలో జిల్లా వ్యాప్త జ్యేష్ట స్వయం సేవకులు, సంఘ్ శ్రేయోభిలాషులు, స్వయం సేవకులు, తదితర పెద్దలు విస్తృతంగా పాల్గొని కార్యక్రమాన్ని ఆద్యంతం ఆస్వాదించారు.

# పట్టణంలో ట్రేడ్ లైసెన్స్ దారులు నష్టపోతున్నారు




**నంద్యాల ఫిబ్రవరి 26 (రిపబ్లిక్ న్యూస్) :**

పట్టణంలో లైసెన్స్ లేని, లైసెన్స్ రెన్యువల్ చేయని వ్యాపారులపై అధికారులు భారీ జరిమానాలు విధించడం వల్ల రెడీమేడ్ వస్త్ర వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నంద్యాల రెడీమేడ్ అసోసియేషన్ అధ్యక్షులు గద్వాల నరసింహరాజు తెలిపారు. గురు వారం నరసింహరాజు మాట్లాడుతూ గత ఆరేళ్లుగా వ్యాపారుల నుంచి ట్రేడ్ లైసెన్స్ ఫీజు సరిగా వసూలు చేయలేదని విమర్శించారు. ఇప్పుడు రిజిస్ట్రేషన్ తేదీ నుంచి ఫీజులు వసూలు చేయడం సరైందికా దన్నారు. గత ఆరేళ్ల ఫీజులను పూర్తిగా రద్దు చేయడంతో పాటు ఫీజు తగ్గించి 2026 నుంచి మాత్రమే వసూలు చేయాలని కోరారు. ప్రభుత్వం వ్యాపారులతో స్నేహపూర్వకంగా ఉంటూ వివిధ ఎంఎస్ ఎంఈ పథకాలను అందిస్తోందన్నారు. గత ఆరేళ్ల ట్రేడ్ లైసెన్స్ ఫీజులు చెల్లించాలని అధికారులు వ్యాపారులను ఒత్తిడి చేయ డం తగదన్నారు.. ట్రేడ్ లైసెన్స్ పొందడం, ఆలస్య రుసుం, జరిమానాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. గత ఆరేళ్లుగా వ్యాపారాలు సరిగా లేక, కమర్షియల్ కాంప్లెక్స్ అద్దెలు ఎక్కువగా ఉండటం వల్ల వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారన్నారు. రెడీమేడ్ వ్యాపారుల సమస్యలపై గౌరవ అధ్యక్షులు పబ్బతి వేణుగోపాల్ సహకారంతో మున్సిపల్ కమిషనర్ శేషన్నతో చర్చించామన్నారు ఈనెల 28వ తేదీ లోపల ఫీజులు, జరిమానాలు కట్టకుంటే మరింత జరిమానాలు విధిస్తామని వస్త్ర వ్యాపారులకు నోటీసులు ఇవ్వడం అన్యాయం అన్నారు. ట్రేడ్ లైసెన్స్ ఫీజుల రుసుమును చెల్లించడానికి మరో నెల రోజులు సమయం పెంచాలని డిమాండ్ చేశారు. మంత్రి ఫరూక్ చొరవ తీసుకొని వ్యాపారస్తుల ట్రేడ్ లైసెన్స్ ల సమస్యను పరిష్కరించాలని కోరారు

# మహిళా భద్రత పై మహిళలకు అవగాహన

**ఇన్స్పెక్టర్ అస్రార్ భాష**



**నంద్యాల క్రైం, ఫిబ్రవరి 26, (రిపబ్లిక్ న్యూస్):**

పట్టణ కేంద్రంలోని ఎన్జీఓ కాలనీ నందు గల గురురాఘవేంద్ర మహిళల వసతిగృహం నందు ఇన్స్పెక్టర్ అస్రార్ భాష 'మహిళా భద్రత' పై మహిళలకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు 'మహిళా భద్రత'కు సంబంధించి వసతి గృహంలో సమస్యలపై చర్చించడంతో పాటు ప్రవేశ నిష్క్రమణ మార్గాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు వాటి పర్యవేక్షణ, పరిసర ప్రాంతాలలో లైటింగ్, మహిళల



భద్రత, ప్రభుత్వం ఏర్పాటు చేసిన చట్టాలపై అవగాహన కల్పించడం జరిగింది. సైబర్ క్రైమ్, సోషల్ మీడియా దుర్వినియోగం, ఆన్‌లైన్ భద్రత విషయాలపై వారికి విస్తృతమైన అవగాహన కల్పించారు. మొబైల్, సోషల్ మీడియా వేదికల ద్వారా వచ్చే ప్రమాదాలను గుర్తించటం, అనుమానాస్పద లింకులు లేదా అనుచిత సందేశాలు వచ్చినప్పుడు వెంటనే పోలీస్ సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. అనంతరం క్రింది ముఖ్యమైన టోల్ ఫ్రీ నంబర్ల గురించి వివరించడం జరిగింది. డయల్ 100/112 అత్యవసర సహాయం, చైల్డ్ లైన్ 1098 (పిల్లల రక్షణ), మహిళ వేధింపులు 1091, సైబర్ నేరాల టోల్ ఫ్రీ 1930, మాదకద్రవ్యాల నియంత్రణ 1972 సంప్రదించాలని తెలిపారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com